



RNI TELTEL/2024/89620

తెలంగాణ

# నేటి శుభోదయ

ప్రతి క్షణం - ప్రజల కోసం

తెలుగు దినపత్రిక






ప్రచురణ : తెలంగాణ | సంపుటి 01 | సంచిక 134 | సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు | పేజీలు - 08 | శనివారం - 04 - జులై - 2026 | వెల రూ. 5 /-




# ఎస్ఐఆర్ నిలిపేయండి..

- సుప్రీంకోర్టుకు 23 మంది విపక్ష నేతల లేఖ
- ఓటర్ల తొలగింపుపై తీవ్ర అభ్యంతరం
- ఈవీఎంలపై ప్రజా చర్చ కోరిన విపక్షాలు
- కేంద్ర సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపణ
- ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని వ్యాఖ్య

## సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

**నేటి శుభోదయ, న్యూ ఢిల్లీ :** దేశ ఎన్నికల ప్రక్రియపై తీవ్ర ఆందోళనలు వ్యక్తం చేస్తూ విపక్షాలు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాశాయి. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని కోరాయి. ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు ఏర్పడిందని ఆరోపించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీతో పాటు 23 మంది విపక్ష నేతలు ఈ లేఖపై సంతకం చేశారు. ఎన్నికల ప్రక్రియలో ప్రజల అసలు తీర్పు ప్రతిబింబించడం లేదని ఆరోపించారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికల సూత్రాలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ రాజకీయ ......

2




## లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తా.. మీరు బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా?

- జూపల్లి



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న అప్పులపై అధికార కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. "తెలంగాణ అప్పులపై చర్చకు నేను సిద్ధం. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌కు సాయంత్రం 5 గంటలకు వస్తా. మరి బీఆర్ఎస్ నేతలు సిద్ధమేనా?" అంటూ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్ విసిరారు. "ఖబడ్దార్ కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు. పాలమూరు పౌరుషమా, కల్వకుంట్ల పౌరుషమా తేల్చుకుందాం రండి" అని ధ్వజమెత్తారు. తన లెక్కలు తప్పు అయితే మంత్రి, ఎమ్మెల్యే పదవులకు తక్షణమే రాజీనామా చేస్తానని, మరి వారి లెక్కలు తప్పైతే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? అని ఛాలెంజ్ చేశారు. కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్పే లెక్కలు నిజమేనని మీడియా ముందు ఒప్పుకోవాలని అన్నారు. అసెంబ్లీలో రాష్ట్ర అప్పులపై కేటీఆర్, హరీశ్‌రావు ఒక్కొక్కరు ఒక్కో రకమైన అబద్ధపు లెక్కలు చెప్పారని జూపల్లి విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్రంపై ఏకంగా రూ.8,21,651 కోట్ల అప్పుల భారం మోపారని ఆయన మండిపడ్డారు. కార్పొరేషన్ల ద్వారా దొంగచాటుగా తెచ్చిన అప్పులను వీరు ఎందుకు దాస్తున్నారని ప్రశ్నించారు. తాను ఆత్మగౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేసి, వ్యాపారాలు చేసుకుని రాజకీయాల్లోకి వచ్చానని.. పారిపోయే లక్షణం తనకు లేదని, అబద్ధాలు చెప్పే అలవాటు అంతకన్నా లేదని స్పష్టం చేశారు.

## సినీ నిర్మాతను మోసం చేసిన షబ్బీర్ అలీ అల్లుడు..? - కేసు నమోదు

- నిర్మాత అనీశ్ రెడ్డిని రూ. 50 లక్షలకు మోసం చేసిన మోసిన్ ఖాన్
- మాజీ పోలీస్ కమిషనర్ ఏకే ఖాన్ కుమారుడే మోసిన్
- జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన అనీశ్ రెడ్డి



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు షబ్బీర్ అలీ అల్లుడు, హైదరాబాద్ మాజీ పోలీస్ కమిషనర్ ఏకే ఖాన్ కుమారుడైన మోసిన్ ఖాన్‌పై హైదరాబాద్‌లో క్రిమినల్ కేసు నమోదైంది. రూ.50 లక్షలు మోసం చేశారంటూ టాలీవుడ్ సినీ నిర్మాత వెంకట అనీశ్ రెడ్డి ...

2

## సామాన్యుడికి గుడ్డు సెగ..

### కోడిగుడ్డు ధరకు రెక్కలు

- ఏడు నుంచి ఎనిమిది రూపాయలకు చేరిన కోడిగుడ్డు ధర
- రూ.205కి చేరిన 30 గుడ్లతో కూడిన ట్రే ధర
- మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపిన అధిక ఉష్ణోగ్రతలు



2

## ట్రిపుల్ తలాక్ తదితర పద్ధతులపై అలహాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు



- ట్రిపుల్ తలాక్, హలాలా పేరుతో బాధితురాలిపై పదేపదే లైంగిక దాడి
- పద్ధతుల ముసుగులో లైంగిక దోపిడీని అనుమతించలేమన్న కోర్టు
- కేసుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ఆదేశం

2

## వారసత్వ సంపద మీ సొత్తు కాదు.. పాకిస్థాన్‌పై భారత్ ఘాటు వ్యాఖ్యలు

- తక్షశిలలో పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర వివాదం
- నిబంధనలకు విరుద్ధంగా పనులు ఆపకపోతే ప్రమాద జాబితాలో చేర్చుతామని యునెస్కో హెచ్చరిక
- వారసత్వ సంపద ప్రపంచానిదని, ఏ ఒక్క దేశానిది కాదని స్పష్టం చేసిన భారత్
- తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగిస్తామని కూడా హెచ్చరించిన యునెస్కో



**నేటి శుభోదయ, హైదరాబాద్ :** ప్రపంచ వారసత్వ ప్రదేశమైన తక్షశిలలోని రెండు చారిత్రక కట్టడాల వద్ద పాకిస్థాన్ చేపట్టిన పునర్నిర్మాణ పనులపై తీవ్ర దుమారం రేగింది. ఈ వ్యవహారంపై ఐక్య రాజ్యసమితి సాంస్కృతిక విభాగం (యునెస్కో) తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయగా, భారత్ కూడా ఘాటుగా స్పందించింది. ఈ అంశంపై న్యూఢిల్లీలో విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. వారసత్వ సంపద, ముఖ్యంగా యునెస్కో గుర్తించిన ప్రదేశాలు ఏ ఒక్క వ్యక్తికి లేదా దేశానికి చెందినవి కావని స్పష్టం చేశారు. "అవి మొత్తం ప్రపంచానికి చెందినవి. మన వారసత్వాన్ని కాపాడుకోవడం, పరిరక్షించడం అందరి సమిష్టి బాధ్యత" అని ఆయన అన్నారు.....

2

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?

### - కేసీఆర్‌కు భట్టి సవాల్!

- హరీశ్‌పై భట్టి తీవ్ర విమర్శలు
- అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్
- కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీ భారం తగ్గించిందన్న డిప్యూటీ సీఎం
- సింగరేణిని బీఆర్ఎస్ సంక్షోభంలోకి నెట్టిందని విమర్శ

2



## అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

### మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి

### - హరీశ్ రావు

- రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందన్న హరీశ్ రావు
- సంగారెడ్డిలో జరిగిన అవగాహన సదస్సులో ప్రభుత్వ తీరుపై విమర్శలు
- మంత్రి జూపల్లి లేఖ ప్రకారం అప్పు రూ.1.77 లక్షల కోట్లు అని వెల్లడి

2



# ఎస్ఐఆర్ నిలిపేయండి..

## సుప్రీంకోర్టుకు విపక్షాల వినతి

మొదటిపేజీ తరువాయి..
ఉద్దేశాలతో జరుగుతోందని విపక్షాలు ఆరోపించాయి. సరైన పత్రాలు లేని పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనారిటీల ఓటు హక్కు ప్రమాదంలో పడుతోందని పేర్కొన్నాయి. లక్షలాది మంది నిజమైన ఓటర్లు జాబితాల నుంచి తొలగింపునకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశాయి. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో 27 లక్షల మంది ఓటర్ల పేర్లు తొలగించారని లేఖలో పేర్కొన్నారు. 'లాజికల్ డిస్క్రిపెన్సీస్' పేరుతో ఈ తొలగింపులు జరిగాయని తెలిపారు. ఒక న్యాయ ట్రైబ్యునల్ పరిశీలించిన 1,777 కేసుల్లో 1,717 తొలగింపులు తప్పుగా జరిగాయని గుర్తించినట్లు వెల్లడించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై కూడా ప్రజల్లో అనుమానాలు పెరుగుతున్నాయని విపక్షాలు తెలిపాయి. అవసరమైతే బ్యాలెట్ పేపర్ విధానాన్ని తిరిగి పరిశీలించాలని సూచించాయి. దీనిపై విస్తృత ప్రజా చర్చ జరగాలని కోరాయి. సీబీఐ, ఈడీ, ఎన్ఐఏ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను విపక్షాలపై రాజకీయ అస్త్రాలుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించాయి. ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేలా వ్యవస్థలను వినియోగిస్తున్నారని పేర్కొన్నాయి. రాజ్యాంగ పరిరక్షణ బాధ్యత సుప్రీంకోర్టుదేనని లేఖలో పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తక్షణ జోక్యం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని సుప్రీంకోర్టును కోరారు.

## సినీ నిర్మాతను మోసం చేసిన షబ్బీర్ అలీ అల్లుడు..?

### - కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి..
ఇచ్చిన ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు ఈ కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని మణికొండ ప్రాంతానికి చెందిన నిర్మాత వెంకట అనీశ్ రెడ్డి ప్రస్తుతం 'మహారాగ్ని' అనే సినిమాను తెరకెక్కిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కోసం ఆయన ఫైనాన్షియర్ల కోసం అన్వేషిస్తున్న తరుణంలో మోసిన్ ఖాన్, తబ్రేజ్ అనే వ్యక్తులు పరిచయమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని 'సన్‌లైట్' కార్యాలయంలో జరిగిన భేటీలో... తాము సినిమాకు అవసరమైన ఫైనాన్స్ సమకూరుస్తామని నమ్మబలికారు. అయితే, ఆ ఫైనాన్స్ ఇప్పించాలంటే తమకు ముందుగా రూ.50 లక్షలు కమీషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వారి మాటలను నిజమని నమ్మిన అనీశ్ రెడ్డి అడిగిన మొత్తాన్ని చెల్లించారు.

## సామాన్యుడికి గుడ్డు సెగ..

### కోడిగుడ్డు ధరకు రెక్కలు

మొదటిపేజీ తరువాయి..
కూరగాయల ధరల మంటతో ఇప్పటికే సతమతమవుతున్న సామాన్య ప్రజలకు కోడిగుడ్ల ధరలు కూడా షాకిస్తున్నాయి. హైదరాబాద్ లో గతంలో ఐదు నుండి ఆరు రూపాయలు పలికిన ఒక్కో గుడ్డు ధర... ప్రస్తుతం మార్కెట్లో ఏడు నుండి ఎనిమిది రూపాయల వరకు చేరుకుంది. ఇక హోల్‌సేల్ మార్కెట్‌లో 30 గుడ్లతో కూడిన ఒక ట్రే ధర ఏకంగా రూ.205కి చేరింది. మునుపెన్నడూ లేని విధంగా చికెన్, గుడ్ల ధరలు అమాంతం పెరిగిపోవడంతో అటు కొనుగోలుదారులు, ఇటు వ్యాపారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణం రాష్ట్రంలో నమోదవుతున్న విపరీతమైన ఎండలేనని పౌల్ట్రీ ఫారాల నిర్వాహకులు చెబుతున్నారు. అధిక ఉష్ణోగ్రతల వల్ల కోళ్లు సరిగ్గా మేత తినకపోవడంతో గుడ్ల ఉత్పత్తి గణనీయంగా పడిపోయింది. దీనికి తోడు హీట్ స్ట్రోక్ కారణంగా పెద్ద సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడటం మార్కెట్‌పై తీవ్ర ప్రభావాన్ని చూపింది. ఫలితంగా డిమాండ్‌కు తగ్గ సప్లై లేక ధరలకు రెక్కలు వచ్చాయి. ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గుడ్ల వినియోగం ఎక్కువగా ఉండటంతో నిర్వాహకులపై అదనపు భారం పడుతోంది. హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, బేకరీల్లో కేక్‌ల తయారీకి గుడ్లు తప్పనిసరి కావడంతో వ్యాపారాలు సాగించడం కష్టంగా మారిందని వారు వాపోతున్నారు. గత 25 ఏళ్లుగా వ్యాపారం చేస్తున్న ఓ వ్యాపారి మాట్లాడుతూ... తన సుదీర్ఘ అనుభవంలో ఎప్పుడూ గుడ్డు ధర ఇంత గరిష్ఠ స్థాయికి చేరలేదని, రెండేళ్ల క్రితం కేవలం కొన్ని రోజులు మాత్రమే ఇలాంటి పరిస్థితి చూశామని తెలిపారు.

## ట్రిపుల్ తలాక్ తదితర పద్ధతులపై అలహాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి.. నికాహ్, హలాలా, ట్రిపుల్ తలాక్ వంటి పద్ధతులపై అలహాబాద్ హైకోర్టు అత్యంత ఘాటు వ్యాఖ్యలు చేసింది. ఈ పద్ధతుల ముసుగులో మహిళలపై జరిగే లైంగిక దోపిడీని ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించలేమని స్పష్టం చేసింది. ఇటువంటి చర్యలు సమాజపు 'చీకటి అధ్యాయం' అని, ఇవి రాజ్యాంగ విలువలకు, మానవ గౌరవానికి విరుద్ధమని కోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తిగత చట్టాల ముసుగులో నేరాలకు రక్షణ కల్పించలేమని స్పష్టం చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని అమ్రోహా ప్రాంతానికి చెందిన బాధితురాలికి 15 ఏళ్ల వయసులోనే బలవంతంగా వివాహం చేసి, ఆపై ట్రిపుల్ తలాక్, హలాలా పేరుతో పదే పదే లైంగిక దోపిడీకి గురిచేశారు. బాధితురాలు మైనర్‌గా ఉన్నప్పుడు అత్యాచారానికి గురైందని, ఆ తర్వాత 'సెకండ్ హలాలా', 'డబుల్ హలాలా'ల పేరుతో ప్రధాన నిందితుడి సోదరుడు, మేనల్లుళ్లు ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపణలు ఉన్నాయి. ఈ దారుణ ఉదంతంపై స్పందించిన హైకోర్టు.. ఇప్పటివరకు వెల్లడైన వాస్తవాలు అత్యంత తీవ్రమైనవని పేర్కొంది. ఇది ఒక మైనర్‌పై పథకం ప్రకారం జరిగిన సామూహిక అత్యాచారాన్ని సూచిస్తోందని, దర్యాప్తు ప్రాథమిక దశలో ఉన్నందున ఎఫ్ఐఆర్ రద్దు చేయడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఇలాంటి సామాజిక అరాచకాలను ప్రాథమిక దశలోనే తుంచేయాలని, ఈ కేసుపై సమగ్ర దర్యాప్తు జరపాలని పోలీసులను ఆదేశించింది. కేసు కొట్టేయాలని, తమ అరెస్టులపై స్టే విధించాలని కోరుతూ నిందితులు వేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది

## బీఆర్ఎస్ అప్పులు రూ.8.21 లక్షల కోట్లు కాదా?- కేసీఆర్‌కు భట్టి సవాల్!

మొదటిపేజీ తరువాయి..
తెలంగాణ అప్పులపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం కొనసాగుతోంది. ఈసారి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఘాటు ఆరోపణలు చేశారు. బీఆర్ఎస్ హయాంలో భారీ అప్పులు చేశారని అన్నారు. అప్పులపై కేసీఆర్, హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి హరీశ్ రావు తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. సచివాలయంలో మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న అప్పులు, ఆర్థిక వ్యవహారాలపై వివరాలు వెల్లడించారు. తమ తప్పులను కప్పిపుచ్చుకునేందుకే కేటీఆర్, హరీశ్ రావు ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో మొత్తం రూ.8.21 లక్షల కోట్ల అప్పులు చేసినట్లు భట్టి తెలిపారు. ఇందులో చెల్లించకుండా వదిలేసిన బకాయిలు కూడా ఉన్నాయని చెప్పారు. పదేళ్ల పాలన అబద్ధాల పునాదులపై సాగిందని విమర్శించారు. ఈ భారీ అప్పులపై మాజీ సీఎం కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ అప్పుల కారణంగా రెండున్నరేళ్లలో అసలు, వడ్డీలు కలిపి రూ.2,08,061 కోట్లు చెల్లించాల్సి వచ్చిందని భట్టి చెప్పారు. అయినప్పటికీ సంక్షేమ పథకాలను ఆపలేదన్నారు. అధిక వడ్డీ అప్పులను రీస్ట్రక్చరింగ్ చేయడం వల్ల వార్షిక వడ్డీ భారం రూ.34 వేల కోట్ల నుంచి రూ.11 వేల కోట్లకు తగ్గిందని వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో సింగరేణిని సంక్షోభంలోకి నెట్టిందని భట్టి ఆరోపించారు. కొత్త కోల్ బ్లాకులు తీసుకురాలేదని విమర్శించారు. బొగ్గు మాయం ఆరోపణలపై ఇప్పటికే సింగరేణి విజిలెన్స్ విచారణకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. కొత్త కోల్ బ్లాకుల కోసం కేంద్రంతో చర్చలు కొనసాగుతున్నాయని తెలిపారు.

# అప్పుల లెక్కల్లో పొంతన లేదు..

## మంత్రి చెప్పింది ఒకటి.. సీఎం చెప్పింది మరొకటి : హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. రాష్ట్ర అప్పుల విషయంలో కాంగ్రెస్ అబద్ధాలు చెబుతోందని, ప్రభుత్వ పెద్దల మధ్యే లెక్కల్లో పొంతన లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తీవ్రంగా విమర్శించారు. సంగారెడ్డిలో ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అధ్యక్షతన 'ఎస్ఐఆర్'పై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత రాష్ట్రం చేసిన అప్పు రూ. 1,77,058 కోట్లు అని మంత్రి జూపల్లి కృష్ణారావు స్వయంగా తనకు లేఖ రాశారని తెలిపారు. అయితే, ఇదే అంశంపై నాలుగు నెలల క్రితం అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం చేసిన అప్పు రూ. 3,45,294 కోట్లు అని చెప్పారని ఆయన గుర్తుచేశారు. ఒకే ప్రభుత్వంలోని మంత్రి ఒక లెక్క, ముఖ్యమంత్రి మరో లెక్క చెప్పడం గందరగోళానికి దారితీస్తోందని హరీశ్ రావు అన్నారు. అప్పుల విషయంలో ప్రభుత్వ పెద్దలు పరస్పర విరుద్ధ ప్రకటనలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఈ లెక్కల్లో ఏది నిజమో ప్రభుత్వం స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## వారసత్వ సంపద మీ సొత్తు కాదు.. పాకిస్థాన్‌పై భారత్ ఘాటు వ్యాఖ్యలు

మొదటిపేజీ తరువాయి.. పురావస్తు కట్టడాల పరిరక్షణ నియమాలను పాకిస్థాన్ ఉల్లంఘిస్తోందన్న నివేదికలపై ఆయన ఈ విధంగా స్పందించారు. పాకిస్థాన్‌లోని ప్రముఖ పత్రిక 'డాన్' కథనం ప్రకారం, తక్షశిలలోని కట్టడాల సమగ్రతను దెబ్బతీసేలా ఉన్న పునర్నిర్మాణ పనులను వెంటనే వెనక్కి తీసుకోవాలని యునెస్కో పాక్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. లేనిపక్షంలో ఆ ప్రదేశాలను 'ప్రమాదకర జాబితా'లో చేర్చుతామని హెచ్చరించింది. అంతేకాకుండా, అనవసరమైన జోక్యం కారణంగా తక్షశిలను ప్రపంచ వారసత్వ జాబితా నుంచి తొలగించడానికి కూడా వెనుకాడబోమని యునెస్కో స్పష్టం చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. తక్షశిలలోని మొహ్రా మొరాదు, సిర్కాప్‌లో పంజాబ్ పురావస్తు శాఖ చేపట్టిన పనులపై సమాచారం, చిత్రాలను మూడో పక్షం పారిస్‌లోని పాక్ శాశ్వత ప్రతినిధికి పంపడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై జూన్ 12న యునెస్కో, పాక్ పురావస్తు శాఖ అధికారులు సంయుక్తంగా తక్షశిలను సందర్శించారు. నిర్మాణాలకు ముందు, తర్వాత తీసిన ఫొటోలు, వినియోగించిన మెటీరియల్‌పై ల్యాబ్ రిపోర్టులు సమర్పించాలని యునెస్కో కోరింది. ప్రపంచ వారసత్వ కట్టడాల పునరుద్ధరణలో సిమెంట్ వాడటం యునెస్కో నిబంధనలను తీవ్రంగా ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. ఈ వివాదం కారణంగా ప్రపంచ వారసత్వ జాబితాలో మరో 24 ప్రదేశాలను చేర్చాలన్న పాకిస్థాన్ ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగిలే అవకాశం ఉంది.

# ఖమేనీ అంత్యక్రియలు

## ప్రపంచాన్ని కదిలిస్తున్న మనవరాలి శవపేటిక!

**నేటి శుభోదయ, డెస్క్ :**
ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల అంత్యక్రియల ప్రక్రియ శుక్రవారం అధికారికంగా ప్రారంభమైంది. టెహ్రాన్‌లోని గ్రాండ్ మొసల్లాలో ఉంచిన వారి శవపేటికల వద్ద వేలాది మంది ప్రజలు అశ్రునయనాలతో నివాళులర్పిస్తున్నారు. అయితే, ఈ విషాదంలో అందరినీ తీవ్రంగా కలిచివేస్తున్న దృశ్యం, ఖమేనీ 14 నెలల మనవరాలు జహ్రా మహమ్మది గోల్పాయెగానీ శవపేటిక. యుద్ధం మిగిల్చిన తీవ్ర విషాదాన్ని, మానవ నష్టాన్ని ఈ దృశ్యం కళ్లకు కడుతోంది. ఇరాన్ జాతీయ పతాకంతో కప్పబడిన పెద్ద శవపేటికల మధ్య, అదే పతాకంతో ఉన్న చిన్నారి శవపేటిక చూపరుల హృదయాలను బరువెక్కిస్తోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన పెద్ద కుమార్తె, అల్లుడు, కోడలు (ప్రస్తుత అగ్రనేత అయతొల్లా మొజ్తబా ఖమేనీ భార్య), మనవరాలు జహ్రా ప్రాణాలు కోల్పోయారు. వారి మృతితో ఇరాన్ సమాజం తీవ్ర దిగ్భ్రాంతికి లోనైంది. అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్తంగా ఇరాన్‌పై సైనిక చర్య చేపట్టిన తొలిరోజే ఈ దాడులు



జరిగాయి. భద్రతా కారణాల దృష్ట్యా నాలుగు నెలలకు పైగా ఖమేనీ, ఆయన కుటుంబ సభ్యుల మృతదేహాలను భద్రపరిచారు. ప్రస్తుతం యుద్ధ వాతావరణం సద్దుమణగడంతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు. జూలై 9న మషద్‌లోని ఇమామ్ రెజా పుణ్య క్షేత్రంలో వీరిని ఖననం చేయనున్నారు.

## మహారాష్ట్ర సర్కార్ కీలక నిర్ణయం... స్కూళ్ల వద్ద 'స్టింగ్' అమ్మకాలపై నిషేధం

**నేటి శుభోదయ, డెస్క్ :** మహారాష్ట్ర ప్రభుత్వం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్న ఆందోళనల నేపథ్యంలో, ప్రముఖ ఎనర్జీ డ్రింక్ 'స్టింగ్' విక్రయాలపై ఆంక్షలు విధించింది. రాష్ట్రంలోని పాఠశాలలకు 500 మీటర్ల పరిధిలో స్టింగ్ ఎనర్జీ డ్రింక్‌తో పాటు మత్తు పదార్థాలను విక్రయించడాన్ని నిషేధిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. శుక్రవారం రాష్ట్ర శాసనసభలో బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ అడిగిన ప్రశ్నకు ఆహార, ఔషధ పరిపాలన (ఎఫ్‌డీఏ) శాఖ మంత్రి నరహరి జిర్వాల్ సమాధానమిచ్చారు. స్టింగ్ వంటి పానీయాల్లో ఉండే కొన్ని పదార్థాలు పాఠశాల విద్యార్థులపై ప్రతికూల ప్రభావం చూపుతాయని, ఈ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన సభకు వివరించారు. ఈ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలని ఎఫ్‌డీఏ అధికారులను ఆదేశించినట్లు ఆయన వెల్లడించారు. పాఠశాల ప్రాంగణాలకు 500 మీటర్ల లోపు ఎవరైనా ఈ ఎనర్జీ డ్రింక్స్ లేదా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నట్లు గుర్తిస్తే, వారిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి జిర్వాల్ హెచ్చరించారు. మరోవైపు, ఎనర్జీ డ్రింక్స్ వల్ల కలిగే ఆరోగ్య నష్టాలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేలా పాఠశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని ప్రభుత్వం సూచించింది. ఈ చర్చ సందర్భంలో పలువురు ఎమ్మెల్యేలు సైతం చిన్నారులకు ఇటువంటి పానీయాలు అందుబాటులో లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఎనర్జీ డ్రింక్స్‌లో ఉండే అధిక కెఫిన్, చక్కెర నిష్పత్తి విద్యార్థుల నిద్ర, ప్రవర్తన




మరియు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని ఆరోగ్య నిపుణులు చాలాకాలంగా హెచ్చరిస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని మహారాష్ట్ర ప్రభుత్వం ఈ కీలక ఆదేశాలు జారీ చేసింది.

## విద్యార్థులు జాతీయ స్థాయి ఛాంపియన్లుగా నిలువడం అభినందనీయం

**-M. P. గా. శ్రీ. ధర్మపురి అరవింద్**

**నిజామాబాద్, నేటి శుభోదయ :**
విద్యార్థులు గ్రామీణ ప్రాంతంలో చదువుతూ జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎంపికకావడం అభినందనీయమని, విజ్ఞానం, విలువలను పెంపొందించుకొంటూ భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్ సూచించారు.గురువారం తన కార్యాలయంలో సత్యశోధక్ పాఠశాలకు చెందిన విద్యార్థులు వి. సాధ్వి, కె. రుగ్వేదా, జి. అద్వైత్ రెడ్డి లు అబాకస్, వేదిక్ మ్యాథ్స్ లో జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఛాంపియన్స్ గా నిలిచి అంతర్జాతీయ స్థాయికి ఎంపికైనందున ఎం. పి. అరవింద్ తన చేతుల మీదుగా అవార్డులు, సర్టిఫికెట్లు మరియు నగదు ప్రోత్సాహాన్ని అందజేసి విద్యార్థులను అభినందించారు. విద్యార్థులు ఇలాగే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఇటువంటి కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్న పాఠశాల అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య, ఉపాధ్యాయులు సతీష్ తదితరులు పాల్గొన్నారు




## దొడ్డి కొమరయ్య వర్ధంతి సభలను జయప్రదం చేయండి

**హైదరాబాద్, నేటి శుభోదయ :**
ఈనెల 4వ తేదీన శనివారం తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరవీరుడు దొడ్డి కొమరయ్య వర్ధంతిని తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయ నాయుడు బీసీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాదులోని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర కార్యాలయంలో పాత్రికేయులతో మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో తన ప్రాణాలు అర్పించిన తొలి అమరజీవి దొడ్డి కొమురయ్య అని ఆయన మరణం తెలంగాణ సాయుధ పోరాటానికి స్ఫూర్తి నిచ్చిందని ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన నిజాం నవాబ్ మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ ను గద్దె దించేందుకు నాలుగు వేల మంది నవ యువ కిశోరాలు ఆత్మ బలిదానంతో తెలంగాణకు విముక్తి జరిగి భారతదేశంలో విలీనం అయ్యిందని ఈనాడు మనమంత భారతీయుల మని సగర్వంగా చెప్పు చెప్పుకున్నామంటే అది సిపిఐ పార్టీచేసిన అసమాన త్యాగాల పునాది అని ఆ మహనీయుడు త్యాగాల్ని గ్రామ గ్రామాన వివరించి నేడు పాలకులు అవలంబిస్తున్న తిరోగమన విధానాలను నేటి యువతరానికి వివరించి వారిని చైతన్యపరచి, మతోన్మాదుల కబంధ హస్తాల నుంచి భరతమాతను విముక్తి చేయాలని ఆయన కోరారు. నాటి స్వాతంత్ర పోరాటం లోనూ ఆ తర్వాత జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలోనూ అలాగే ఇటీవల జరిగిన ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలోనూ అశువులు బాసిన వారిలో బీసీలే ప్రథమ స్థానంలో ఉన్నారని త్యాగాలకు ప్రతీకైన బీసీలకు మాత్రం పాలకులు అభివృద్ధిలో తగువాటా ఇవ్వడం లేదని రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా బీసీల వెనకబాటు తనానికి పాలకులు అనుసరిస్తున్న విధానాలే కారణమని అందువల్ల బీసీలు చైతన్యమై న్యాయమైన హక్కుల కోసం బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో జరిగే పోరాటాల్లో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



## రియల్ ఎస్టేట్ అక్రమాలపై రెరా కన్నెర్ర

**- విలేకరుల సమావేశంలో ఆర్.టి.ఐ కార్యకర్త రాము వెల్లడి**

**ఖమ్మం, నేటి శుభోదయ :**
ప్రజల సొంత ఇంటి కలను ఆసరా చేసుకుని,అక్రమాలకు పాల్పడుతున్న రియల్ఎస్టేట్ వెంచర్లపై అధికారులు కొరడా ఝులిపించారని, ఖమ్మం ప్రజలను మోసం చేస్తూ, తెలంగాణ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘనకు పాల్పడిన ఇండో ఖతార్ యాజమాన్యానికి రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (రెరా) భారీ జరిమానా విధించిందని ఆర్.టి.ఐ కార్యకర్త ఎన్ .రాము తెలిపారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శుక్రవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధర్మస్థలి, క్షేత్ర– 1, క్షేత్ర– 2, ధరణీ, ప్రణామం వంటి రియల్ ఎస్టేట్ వెంచర్లు రెరా నిబంధనలను పాటించలేదని, తను ఆర్టిఐ ద్వారా ఫిర్యాదు చేయగా వాస్తవ పరిస్థితులు వెలుగులోకి వచ్చాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అనుమతులు లేకుండా రియల్ ఎస్టేట్ యాజమాన్యం తప్పుడు విధానాలు అవలంబించడంతో రేర సంస్థ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు వెల్లడించారు. ఇండో ఖతార్ మోసపూరితంగా వ్యవహరించడంతో యాజమాన్యానికి 38.63 లక్షల రూపాయల అపరాధ రుసుం విధించి నెల రోజుల్లోగా చెల్లించాలని రెరా ఆదేశాలు జారీ చేసినట్లు రాము తెలిపారు.రెరా అనుమతులు పొందకుండా మార్కెటింగ్ చేయడం, మోసపూరిత ప్రకటనలు, అక్రమ అమ్మకాలు చేయడం పట్ల రేరా అభ్యంతరం వ్యక్తం చేసిందని పేర్కొన్నారు.ఖమ్మం జిల్లా చరిత్రలో ఒక రియల్ ఎస్టేట్ యాజమాన్యానికి ఇంత భారీ మొత్తంలో అపరాధ రుసుం వేయడం ఇదే ప్రథమం అన్నారు. యాజమాన్య అక్రమాలపై గతంలో రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు ఆర్టీఐ సభ్యులు ఎన్ .రాము పేర్కొన్నారు. కొణిజర్ల మండలం అమ్మపాలెం గ్రామ పరిధిలో . కాలువ ఆక్రమణకు గురి అయిందని రెవిన్యూ అధికారులు నిర్ధారించినా, స్వాధీనం చేసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రెవిన్యూ యంత్రాంగం స్పందించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. అక్రమాలను నిరోధించాలని విజ్ఞప్తి చేశారు.




## ఒన్నజీపేట్ గ్రామంలో తీవ్ర విషాదం

**నిజామాబాద్, నేటి శుభోదయ :**
నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండలం ఒన్నజీపేట్ గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. గ్రామానికి చెందిన అంతి కృష్ణమోహన్, కవిత దంపతుల ఏకైక కుమారుడు కృష్ణ మనోహర్ (14) చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డా డు. మృతుడు కృష్ణ మనోహర్ ఈ సంవత్సరమే పదో తరగతి పూర్తి చేశాడు. కొడుకును పైచదువుల కోసం జిల్లా కేంద్రంలోని మంచి కాలేజీలో చేర్పించి, ఉన్నత స్థాయికి తీసుకురావాలని ఆ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొడుకు భవిష్యత్తు గురించి ఎన్నో కలలు కంటున్న తరుణంలో, ఊహించని విధంగా వయసు రాని పిల్లాడు ఇలా విగతజీవిగా మారడంతో ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. క ండ్ల ముందే తిరిగిన ఏకైక కుమారుడు ఇక లేడనే నిజాన్ని జీర్ణించుకోలేక తల్లిదండ్రులు గుండెలు పగిలేలా రోదిస్తున్న తీరు స్థానికులను తీవ్రంగా కలచివేసింది. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.





## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ చే ఎన్యూమరేషన్ ఫారాలు అందజేత



**ఖమ్మం, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర మాజీ రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తమ కుటుంబ సభ్యుల సర్ ఎన్యూమరేషన్ ఫారాలను సంబంధిత బిఎల్ఓ షాహీన్ కమల్ కి సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబం తమ సర్ ఎన్యూమరేషన్ ఫారాలను తప్పనిసరిగా నింపి సంబంధిత బిఎల్ఓ లకు సమర్పించాలని కోరారు. ఫారాలు నింపడంలో లేదా వివరాల విషయంలో ఎవరికైనా ఇబ్బందులు ఎదురైతే, బిఆర్ ఎస్ పార్టీ తరపున ప్రతి డివిజన్లో అందుబాటులో ఉన్న బిఎల్ఎస్ సభ్యులు పూర్తి సహాయం అందిస్తారని తెలిపారు.

## అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం : ప్రిన్సిపాల్

**ఖమ్మం, నేటి శుభోదయ :**
డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వ విద్యాలయం ప్రాంతీయ కేంద్రం ఖమ్మం యందు 2026– 27 విద్యా సంవత్సరానికి గాను బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులతో పాటు ఎంఏ, ఎం కామ్, ఎంఎస్సీ కోర్సులకు అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనదని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ మహమ్మద్ జాకిరుల్లా, అధ్యయన కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ గుగులోత్ వీరన్న ఒక ప్రకటనలో తెలియ జేశారు. ఆసక్తిగల అభ్యర్థులు సమీపంలో గల మీసేవ కేంద్రంలోని గాని,నెట్ సెంటర్ లో గానీ సొంతంగా గాని www.drbraou.online వెబ్సైటు లో ఆన్లైన్లో అప్లికేషను నింపి ఒక జత జిరాక్స్ పత్రాలను జతచేసి ఒరిజినల్ ధ్రువపత్రాలతో అధ్యయన కేంద్రంనకు సందర్శించి అడ్మిషన్ నిర్ధారించుకున్న తరువాత ట్యూషన్ ఫీజులు చెల్లించవలెను. ఈ అడ్మిషన్ల ప్రక్రియ ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతుంది. మన అధ్యయన కేంద్రంలో ఈ సంవత్సరం నుండి నూతనంగా ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఎంఎస్సీ బాటని, ఎంఎస్సీ జువాలజీ, ఎమ్మెస్సి కంప్యూటర్ అప్లికేషన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నవి. కావున సైన్స్ అభ్యర్థులు దూర ప్రాంతాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలకు వెళ్లకుండా ఇక్కడే అడ్మిషన్లు పూర్తి చేసుకోవాల్సిందిగా కోరడమైనది. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని తెలియజేశారు. అదేవిధంగా ద్వితీయ, ద్వితీయ సంవత్సరం విద్యార్థిని విద్యార్థులు పిజి సెకండ్ సెమిస్టర్ విద్యార్థులు వారి ట్యూషన్ ఫీజులను ఆగస్టు 7వ తేదీలోగా చెల్లించవలసిందిగా తెలియజేయడం జరిగింది. ఆరవ సంవత్సరం ఆరవ కామ నాలుగవ, రెండవ సెమిస్టర్ విద్యార్థుల ప్రాక్టికల్ తరగతులకు సంబంధించిన షెడ్యూల్ను కళాశాలలకు పంపించడం జరిగినది కావున వారు సమీప అధ్యయన కేంద్రాలను సందర్శించి తమ యొక్క ప్రాక్టికల్ షెడ్యూల్ తెలుసుకొని సకాలంలో ప్రాక్టికల్ క్లాసులకు హాజరు కావలసిందిగా కోరడం జరిగింది.

## నేడు ఖమ్మం లో శ్రీ దొడ్డి కొమురయ్య వర్ధంతి

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం, నేటి శుభోదయ :**
జూలై 4న ఉదయం 9 గంటలకు ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్ద శ్రీ దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ దొడ్డి కొమురయ్య విగ్రహానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ కులస్తులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## క్రిస్టియన్ మైనారిటీల స్వయం ఉపాధి పథకాలకు ఆన్లైన్ దరఖాస్తులు ఆహ్వానం

**- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముజాహిద్**

**ఖమ్మం, నేటి శుభోదయ :**
తెలంగాణ రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2026–27 సంవత్సరానికి అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.అర్హులైన క్రిస్టియన్ మైనారిటీల నుంచి కుట్టు మిషన్, చిన్న వ్యాపారం, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ స్వయం ఉపాధి పథకాల కోసం ఆన్లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అన్నారు. పట్టణ ప్రాంతాలకు చెందిన అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం 2 లక్షల రూపాయల లోపు, గ్రామీణ ప్రాంతాల అభ్యర్థుల వార్షిక కుటుంబ ఆదాయం లక్ష 50 వేల లోపు ఉండాలని తెలిపారు. కుట్టు మిషన్, చిన్న వ్యాపారం పథకాలకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 సంవత్సరాల మధ్య ఉండాలని, ఈ–బైక్, ఈ–స్కూటీ, మోటార్ బైక్ పథకాలకు 21 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు.అర్హులైన క్రిస్టియన్ మైనారిటీలు జూలై 18 వరకు tsobmms.cgg.gov.in వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 9704003002 మొబైల్ నంబర్ నందు సంప్రదించాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ముహమ్మద్ ముజాహిద్ ఆ ప్రకటనలో కోరారు.

## డీసీసీ అధ్యక్షుడు జంగయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నక్క సందీప్ గౌడ్



**శామీర్ పేట, నేటి శుభోదయ :** నూతనంగా 300 – షామీర్‌పేట్ డివిజన్ అధ్యక్షుడిగా నియమితులైన నక్క సందీప్ గౌడ్ శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షుడు తోటకూర జంగయ్య యాదవ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు జంగయ్య యాదవ్, నక్క సందీప్ గౌడ్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అజయ్ యాదవ్, లక్ష్మి రెడ్డి, టి.ఆర్. రవీందర్ గౌడ్, యేసుదాస్, పి. అశోక్, ఆర్. గణేష్, సాత్విక్ కొత్త తదితరులు పాల్గొన్నారు.

## 27వేల ప్రభుత్వ పాఠశాలల కుదింపుపై ఉద్యమిస్తాం

### - వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు




**కొత్తగూడెం, నేటి శుభోదయ :** 27వేల ప్రభుత్వ పాఠశాలలను 4వేల క్లస్టర్ ప్రభుత్వ పాఠశాలలుగా కుదింపు చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు వరక అజిత్, బుర్ర వీరభద్రం, మంద నాగకృష్ణ, దుర్గం ప్రణయ్ డిమాండ్ చేశారు. జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్ సన్నాహక సమావేశం స్థానిక కొత్తగూడెం పట్టణ కేంద్రంలోని శేషగిరి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేస్తూ, విద్యను వ్యాపార వస్తువుగా మార్చే విధానాలను అమలు చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యారంగానికి బడ్జెట్‌ను తగ్గించడం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టి, పాఠ్యపుస్తకాలు, యూనిఫాంల బలవంతపు అమ్మకాలను నిలిపివేయాలన్నారు. ఖాళీగా ఉన్న అన్ని ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, రాష్ట్రంలో నూతన జాతీయ విద్యా విధానం అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని కోరారు. మధ్యాహ్న భోజన పథకానికి సరిపడా నిధులు కేటాయించాలని, ఇంటర్ విద్యార్థులకు కూడా మధ్యాహ్న భోజనం, బ్రేక్ ఫాస్ట్ అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, విద్యాహక్కును పరిరక్షించుకోవడానికి జూలై 10న నిర్వహించే రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాసంఘాలు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో పిడిఎస్ యు కొత్తగూడెం పట్టణ నాయకులు హర్ష వర్ధన్, సాగర్, నవీన్, ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రేమ్ కుమార్, దిలీప్ కుమార్, విద్యాసాగర్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సృజన్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ -2026 కార్యక్రమంలో ఎన్యూమరేషన్ ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలి



**ఖమ్మం, నేటి శుభోదయ :**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సర్ –2026 కార్యక్రమంలో భాగంగా ఏఎల్ఎంటి లు, ఏఈఆర్ఓ లు, బిఎల్ఓ లకు ఎన్యూమరేషన్ ప్రక్రియపై విస్తృతంగా శిక్షణ అందిస్తున్నారు. ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, సేకరణ, మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, అనుగుణంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రతి ఓటరు వివరాలను కచ్చితంగా సేకరించి, పరిశీలించిన అనంతరం యాప్‌లో అప్లోడ్ చేయాలని తెలిపారు.శిక్షణ సందర్భంగా బిఎల్ఓ లు క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న పనితీరును పరిశీలిస్తూ, ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన ఓటర్ల వివరాలను నమోదు చేస్తున్నారా, సమాచారాన్ని యాప్‌లో సక్రమంగా నమోదు చేస్తున్నారా అనే అంశాలను పరిశీలించారు. అవసరమైన చోట మార్గనిర్దేశం చేస్తూ ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ప్రతి ఓటరుకు సంబంధించిన వివరాలు ఖచ్చితంగా నమోదు కావడంతో పాటు మ్యాపింగ్ ప్రక్రియను సకాలంలో పూర్తి చేసి సర్ –2026 కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతి బిఎల్ఓ బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు.

## భవిష్యత్ ఉద్యోగావకాశాలకు కృత్రిమ మేధస్సు నైపుణ్యాలే కీలకం






**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మంలోని ప్రియదర్శిని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ (స్వయంప్రతిపత్తి కళాశాల) ఆధ్వర్యంలో విద్యార్థినులకు భవిష్యత్ ఉద్యోగావకాశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏఐ స్కిల్స్ గెట్ యు హైరెడ్ ఇన్ 2026 అంశంపై ఒకరోజు ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఓఎన్‌ఆర్ ఓ ఎల్ ఎఐ ఎగ్జిక్యూషన్ స్కూల్ సహకారంతో నిర్వహించారుఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కళాశాల చైర్మన్ కాటేపల్లి నవీన్ బాబు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు (ఏఐ) అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు నాంది పలుకుతోందని అన్నారు. సంప్రదాయ విద్యతో పాటు ఏఐ, డిజిటల్ సాంకేతిక నైపుణ్యాలను విద్యార్థులు అలవర్చుకుంటే దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విశేషమైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశాలు మెరుగవుతాయని పేర్కొన్నారు. భవిష్యత్ పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థినులను తీర్చిదిద్దేందుకు కళాశాల యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. గోపాల్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు సాంకేతిక రంగానికే పరిమితం కాకుండా విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపారం తదితర అన్ని రంగాలలో విస్తృత ప్రభావాన్ని చూపుతోందన్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యాసంస్థలు కేవలం విద్యను అందించడమే కాకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్లో ఆధునిక నైపుణ్యాలను పెంపొందించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. ఏఐ స్కిల్స్ గెట్ యు హైరెడ్ ఇన్ 2026 వంటి వర్క్‌షాప్‌లు విద్యార్థినులకు కృత్రిమ మేధస్సు, డిజిటల్ సాంకేతికతలు, పరిశ్రమల తాజా ధోరణులపై సమగ్ర అవగాహన కల్పించడంతో పాటు, ఉపాధికి అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేందుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు విశ్లేషణాత్మక ఆలోచన, సమస్య పరిష్కార సామర్థ్యం, సృజనాత్మకత, వృత్తి నైతిక విలువలను పెంపొందించుకుంటూ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభ్యసిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ అవకాశాలను అందిపుచ్చుకోగలరని పేర్కొన్నారు. విద్యార్థినుల సమగ్ర వ్యక్తిత్వ వికాసం, నాణ్యమైన విద్య, పరిశోధనా దృక్పథం, ఉత్తమ ఉద్యోగ అవకాశాల సాధనే కళాశాల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా డా. సునీత పి. అష్టికర్ ఎస్ఆర్ యూనివర్సిటీ, స్కూల్ ఆఫ్ బిజినెస్, వరంగల్ మాట్లాడుతూ, నేటి విద్యా వ్యవస్థలో జ్ఞానంతో పాటు పరిశోధనా దృక్పథం, ఆవిష్కరణాత్మక ఆలోచన, సాంకేతిక నైపుణ్యాలు అత్యంత అవసరమని పేర్కొన్నారు. మారుతున్న ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు నిరంతరం నేర్చుకుంటూ, తమ వ్యక్తిగత, వృత్తిపరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు, అకాడమిక్ విజ్ఞానాన్ని ఆచరణాత్మక అనుభవంతో మేళవించగలిగినప్పుడే నిజమైన విజయం సాధ్యమవుతుందని పేర్కొంటూ, విద్యార్థులు పరిశోధన, ఆవిష్కరణలు, ఇంటర్న్‌షిప్‌లు, పరిశ్రమలతో అనుసంధానమైన శిక్షణా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని నేర్చుకోవడాన్ని జీవితాంతం కొనసాగే ప్రక్రియగా భావించి, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ మరియు అంకితభావంతో ముందుకు సాగితే జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత విజయాలను సాధించవచ్చని ఆమె పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఒఎన్ ఆర్ ఓఎల్ వ్యవస్థాపకురాలు డాక్టర్ నీరజా రెడ్డి మాట్లాడుతూ నేటి ప్రపంచంలో విద్య అనేది కేవలం డిగ్రీలు సాధించడానికే పరిమితం కాకుండా, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను పెంపొందించుకునే ప్రక్రియగా మారిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానం వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో విద్యార్థులు నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని, కృత్రిమ మేధస్సు విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపారం, పరిశోధన తదితర రంగాల్లో విప్లవాత్మక మార్పులకు దారితీస్తోందని, ఈ మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తమ ఆలోచనా విధానాన్ని, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీరామ్ రెడ్డి, ఓఎన్‌ఆర్‌ఓ ఎల్ సర్టిఫైడ్ ఏ ఐ ట్రైనర్, ఏఐ కోర్స్ డెవలపర్, ఎడ్యుకేటర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు అన్ని రంగాల్లో విప్లవాత్మక మార్పులకు కారణమవుతోందని తెలిపారు. రానున్న కాలంలో ఉద్యోగ అవకాశాలు కేవలం విద్యార్హతల ఆధారంగా కాకుండా, విద్యార్థులు కలిగి ఉన్న నైపుణ్యాల ఆధారంగా నిర్ణయించబడతాయని అన్నారు, ఏఐ అనేది ఉద్యోగాలను తగ్గించే సాంకేతికత కాదని, కొత్త అవకాశాలను సృష్టించే శక్తివంతమైన సాధనమని పేర్కొన్నారు. ఏఐ ను సమర్థవంతంగా వినియోగించగల నైపుణ్యం ఉన్న వారికి దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృతమైన ఉపాధి అవకాశాలు అందుబాటులో ఉంటాయని, ముఖ్యంగా ప్రాంప్ట్ ఇంజనీరింగ్, ఏ ఐ టూల్స్, డేటా అనాలసిస్, ఆటోమేషన్ వంటి ఆధునిక నైపుణ్యాలను విద్యార్థులు తప్పనిసరిగా నేర్చుకోవాలని సూచించారు.అకాడమిక్ డైరెక్టర్ ఎ. వెంకటరమణ మాట్లాడుతూ విజయం అనేది అదృష్టం ఫలితం కాదని, క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర కృషి, నేర్చుకోవాలనే తపనతోనే సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి సవాలును ఒక అవకాశంగా స్వీకరించి, ప్రతి రోజును కొత్త అభ్యాసానికి వేదికగా మార్చుకుంటే అసాధ్యమనే పదానికి తావు ఉండదన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు నిరంతరం కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని నేర్చుకుంటూ, తమ జ్ఞానాన్ని ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభను చాటే ఇంజినీర్లు, మేనేజర్లు, నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాలకు చెందిన వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

## తగరం సంచుల కన్నా, వస్త్ర సంచులు మిన్న : ఆశామిత్ర 'లంకా'

**మధిర, నేటి శుభోదయ :** మానవ మనుగడ ను దెబ్బ తీసే ప్లాస్టిక్ వస్తువులను, ప్రధానంగా ప్లాస్టిక్ కవర్లు పూర్తిగా నిషేదించాలి అని ప్రముఖ సంఘ సేవకులు, మధిర ఆశ మిత్ర లంకా కొండయ్య తెలియజేస్తూ ప్లాస్టిక్ నిరోదానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించవలసిన నియమాలు సంపూర్ణంగా వివరించారు. శుక్రవారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా మధిర, ఎర్రుపాలెం ప్రాంతాల్లో కొన్ని చోట్ల గుంపు గూడిన ప్రజలు వద్ద ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాలి అని ప్లాస్టిక్ వాడకం వల్ల ప్రతి 10 మందిలో ఒకరికి క్యాన్సర్ 2030 సంవత్సరానికి రావచ్చు అని నిపుణులు తెలియజేస్తున్నారు. కావున ప్రతి ఒక్కరు మార్కెట్ కు వెళ్లే టప్పుడు క్లాత్ బ్యాగ్స్ వాడాలి అని మటన్ మార్కెట్ కు వెళ్లే టపుడు స్టీల్ బాక్స్ లతో వెళ్ళాలని కోరారు. దీని వలన మానవ మనుగడపై చాలా ప్రభావం పడుతుందని, ఉమ్మడి ప్రయత్నం ఉద్యమ రూపంగా ప్లాస్టిక్ రహిత సమాజం కోసం అందరు బాగా స్వాములు కావాలని దీనికి తోడు పచ్చధనం –పరిశుభ్రత పై మక్కువ చూపాలని పలు విషయాలతో సమాజానికి పత్రిక ముఖముగా పిలుపు నిచ్చారు. ఇప్పటివరకు పనికి రాని బట్ట ముక్కలతో మూడు వేల క్లాత్ బ్యాగ్ లు స్వచ్ఛందంగా లంకా సేవ ఫౌండేషన్ ద్వారా కుట్టించి ఆరోగ్యశాఖ తరుపున సమాజంలో ప్రజలకు పంచి పెడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి చేస్తున్నట్లు కొండయ్య వివరించారు.













# 28వ వార్డుకు 'దండి'గా నీటి వరం



**ఖమ్మం, నేటి శుభోదయ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న 28వ వార్డు సీపీఐ కౌన్సిలర్ దండి రంగారావు మరో కీలక హామీని కార్యరూపంలోకి తీసుకొచ్చారు. వార్డులో చాలాకాలంగా నెలకొన్న తాగునీటి సమస్యను గుర్తించి, మున్సిపల్ అధికారులతో నిరంతరం సమన్వయం చేస్తూ పైప్‌లైన్ ఏర్పాటుకు చొరవ తీసుకోవడంతో శుక్రవారం పనులు ప్రారంభమయ్యాయి. ఈ మేరకు శాబాద్ నగర్ ఆర్చి వద్ద కౌన్సిలర్ దండి రంగారావు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఆర్చి నుంచి ముత్యాలమ్మ ఆలయం వరకు సుమారు 300 మీటర్ల మేర కొత్త మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటు చేయనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆ ప్రాంత ప్రజలకు తాగునీటి ఇబ్బందులు గణనీయంగా తగ్గనున్నాయి. ఈ సందర్భంగా కౌన్సిలర్ దండి రంగారావు మాట్లాడుతూ ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం నా బాధ్యత అన్నారు. వార్డులో ఎక్కడ నీటి సమస్య ఉన్నా వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానన్నారు. మిషన్ భగీరథ నీరు అందని ప్రాంతాలకు కూడా పైప్‌లైన్ విస్తరణ కోసం కృషి చేస్తాను అని తెలిపారు.కౌన్సిలర్ చొరవతో ఎట్టకేలకు పైప్‌లైన్ పనులు ప్రారంభం కావడంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంచినీటి సౌకర్యానికి నిధులు మంజూరు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఏర్పాటుకు సహకరించిన కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్ రెడ్డికి కౌన్సిలర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలపై స్పందిస్తూ అభివృద్ధి పనులకు ప్రాధాన్యం ఇస్తున్న దండి రంగారావును పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకుడు శాబాద్ చిన్న సైదిరెడ్డి, స్థానిక నాయకులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# మూగవోయిన పీడిత ప్రజల గొంతుక -అరుణోదయ 'నాగన్న' ఇకలేరు



**ఖమ్మం, నేటి శుభోదయ :**
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య పోరుకేక,పాటే ఆయుధంగా పోరాడిన పీడిత ప్రజల గొంతుక,అరుణోదయనే ఇంటిపేరుగ జేసుకున్న నాగన్న ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో దీర్ఘ కాలంగా చికిత్స పొందుతూ శుక్రవారం తుదిశ్వాస విడిచారు. ఈ వార్త రాజకీయ పార్టీలు,గాయకులు,కళాకారులు,ప్రజా సంఘాలను దిగ్భ్రమకు గురిచేసింది.జానపద బాణీలను బాణాలుగ సంధించిన ఒక సంచలన గాయకుడు నాగన్న వదశాబ్దాలుగా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి విప్లవ గీతాలతోనే పయనించారాయన. ఆయన పాటలు భావాల ఉద్వేగాల అలలు సప్త స్వరాల ఆరోహణ అవరోహణల కెరటాలు.దోపిడి రాపిడిపై తిరగబడ్డ తెలంగాణ వాగ్గేయకారుడు,కాలం ప్రసవించిన విప్లవ స్వాప్నిక గళమతడు. నెత్తుటి జెండాతో చెలిమి చేస్తూ అరుణోదయ బాటగా పోరు నడిపిన నిఖార్సయిన యోధుడని ఆయన పార్థివ దేహాన్ని సందర్శించిన వారంతా పేర్కొని అంజలి ఘటించారు..

# దిడ్డిగె వారి పెళ్లి వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

**సంగారెడ్డి, నేటి శుభోదయ :**
సదాశివపేట పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త దిడ్డిగె శ్రీనివాస్, శ్రీమతి అరుణ దంపతుల ఏకైక పుత్రిక కృష్ణ ప్రియ వివాహ వేడుక ఘనంగా నిర్వహించబడింది. వరుడు రాహుల్ వెంకట్‌తో జరిగిన ఈ వివాహ మహోత్సవం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ప్రముఖుల సమక్షంలో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ వివాహ వేడుకలకు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి దాంపత్య జీవితం ఆనందమయం, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్య సంపదలతో సుఖశాంతులతో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా దిడ్డిగె కుటుంబ సభ్యులను పులిమామిడి రాజు ప్రత్యేకంగా అభినందించారు. వివాహ వేడుకకు విచ్చేసిన అతిథులతో ఆప్యాయంగా పలకరించి శుభాకాంక్షలు తెలియజేశారు.వివాహ వేడుకలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పట్టణ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన వధూవరులకు తమ ఆశీస్సులు అందజేశారు.ఈ వివాహ



వేడుక ఆత్మీయ వాతావరణంలో అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఇట్టి కార్యక్రమంలో వారితో పాటు 11వ వార్డు కౌన్సిలర్ వైద్యం పవన్ కుమార్, మద్దికుంట సర్పంచ్ దేవి సింగ్, అఖిల్, తాలెల్మ రాము, ప్రసాద్ మొదలగు వారు పాల్గొన్నారు.

# 13వ వార్డులో ఇందిరమ్మ ఇంటిని మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ, కమిషర్ శివాజితో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన TGIIC చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి

**సంగారెడ్డి , నేటి శుభోదయ :**
మున్సిపల్ పరిధిలోని 13వ వార్డులో లబ్ధిదారురాలికి మంజూరైన ఇందిరమ్మ ఇంటిని TGIIC చైర్మన్ తూర్పు నిర్మలా జగ్గారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కలను నిజం చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మునిపల్లి అంజమ్మ సత్యనారాయణ, వైస్ చైర్మన్ రేణుక చిరంజీవి, మున్సిపల్ కమీషనర్ తౌటం శివాజి, హౌసింగ్ AE రేష్మ, పట్టణ ఇంచార్జ్ తోపాజి అనంత కిషన్, స్థానిక పట్టణ అధ్యక్షులు పట్లూరి నాగరాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కంది కృష్ణ వాడు కౌన్సిలర్ ఎర్ర విశాలి కౌన్సిలర్లు అరుణ్ వాజిద్ కో ఆప్షన్ సభ్యులు రహ్మత్ వాజిద్ కాంగ్రెస్ సీనియర్



నాయకులు పట్నం సుభాష్ శరత్ సాబేర్ నాయకులు పవన్ భరత్,బాబు కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రపంచ ద్విచక్ర వాహన మెకానిక్ దినోత్సవ శుభాకాంక్షలు




**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం పట్టణ టు వీలర్ మెకానిక్ యూనియన్ అధ్యక్షులు వంగాల కొండలరావు ఆధ్వర్యంలో శుక్రవారం వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్ షాప్ నందు మెకానిక్స్ డే సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. నిత్య జీవితంలో మనిషి పక్క మనిషి మీద ఆధారపడి బ్రతకక తప్పదు పరస్పరం ఒకరిపై ఒకరు ఆధారపడటం అనేది మన సంస్కృతిలో గొప్ప విషయం మనిషిని మనిషిగా గౌరవిద్దాం తోటి మెకానికులను గౌరవిద్దాం మెకానిక్ లలో దాగి ఉన్న ప్రతిభను గుర్తిద్దాం మనసారా అభినందిద్దాం అందుకోవడానికి ప్రయత్నిద్దాం మెకానికులు రాత్రి అనక పగులునక శ్రమించి వారి కష్టానికి సైతం మంచి గుర్తింపుని ఇద్దాం అందుకే మన పెద్దలు శ్రమ పునాది పైనే అభివృద్ధి అనే భవనం ఆధారపడి ఉంటుందని అంటారు. శ్రమించడానికి ఎవరు సిగ్గు పడకూడదు శ్రమించకపోతే సిగ్గుపడాలి శ్రమకై జీవన సౌందర్యాన్ని ప్రత్యేకంగా చూడగలగాలి పని చేయడం అలవాటైతే ఆ తర్వాత అది లేకుండా ఉండడం కష్టమవుతుంది. ఈ ప్రపంచంలో ప్రతి విషయం పని మీద ఆధారపడి ఉంటుంది. ఈవిధంగా వివిధ వృత్తుల వారిపట్ల గౌరవాన్ని శ్రమ విలువలను పెంపొందించటమే మా మెకానికుల ప్రధమ ఉద్దేశం. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథి గా ఖమ్మం యూనియన్ అధ్యక్షుడు వంగాల కొండలరావు , వర్కింగ్ ప్రెసిడెంట్ బుల్లెట్ అన్వర్ , ప్రచార కార్యదర్శి దుంపల నాగరాజు , నెలకొండపల్లి యూనియన్ అధ్యక్షుడు జహంగీర్ ,షేక్ అబ్బాస్ , మేడి పాండ్డు మరియు స్థానిక మెకానిక్ సోదరులు తదితరులు పాల్గొనారు

# హలో మాదిగ జులై 7న ఛలో ఈదుమూడి



**వరంగల్, నేటి శుభోదయ :** సామాజిక న్యాయం, సమానత్వం మరియు దళితుల లోని అత్యంత అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) సుదీర్ఘకాలంగా అవిశ్రాంత పోరాటాలు చేసిందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగారపు చిరంజీవీ మాదిగ పేర్కొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ..తెలుగు రాష్ట్రాల మాదిగ సమాజ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయే మహత్తర ఘట్టమైన మాదిగల పుణ్యక్షేత్ర శంఖుస్థాపన కార్యక్రమం ఈ నెల 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలో ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడనుందని కావున ఎమ్మార్పీఎస్ నాయకులు తరలిరావాలని పిలుపునిచ్చారు సామాజిక న్యాయం, సమాన హక్కులు, ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మూడు దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తున్న మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ఉద్యమం వేలాది మంది కార్యకర్తల త్యాగాలు, అరెస్టులు, లాఠీచార్జీలు, కష్టనష్టాలతో ముందుకు సాగింది. ఈ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసిన అమరవీరుల త్యాగాలను ఈ సందర్భంగా ఘనంగా స్మరించుకొనుటకు వారికి పుణ్యక్షేత్రం నిర్మించడం జరుగుతుంది వారి ఆశయ సాధనకు ప్రతి మాదిగ కుటుంబం అంకితభావంతో ముందుకు రావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ నాయకులు పిలుపునిచ్చారు.ఈ నేపథ్యంలో ఈ నెల 7న ప్రకాశం జిల్లా ఈదుమూడిలోమాదిగల పుణ్యక్షేత్ర శంఖుస్థాపన సందర్భంగా ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పిసిసి అధికార ప్రతినిది నల్గొండ రమేశ్ ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన చేతుల మీదుగా వాల్ పోస్టర్స్ ను ఆవిష్కరించారు. ప్రకాశం జిల్లా,ఈదుమూడిలో నిర్మించబోయే మాదిగల పుణ్యక్షేత్రం భావితరాలకు ఉద్యమ స్ఫూర్తిని అందించే చారిత్రక చిహ్నంగా నిలవాలని, రాష్ట్రంలోని ప్రతి మాదిగ కుటుంబం పాల్గొనాలని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు చిటుపాక ప్రభాకర్ మాదిగ ఆదేశాల మేరకు హలో మాదిగ-ఛలో ఈదుమూఢి పిలుపుతో ఉద్యమకారులు, యువత ,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా నాయకత్వం విజ్ఞప్తి చేసింది.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ వరంగల్ జిల్లా ఇంచార్జ్ జన్నువేణు మాదిగ,ఎమ్మార్పీఎస్ కో-ఇంచార్జ్ గోవిందు రమేశ్ మాదిగ,రాష్ట్ర నాయకులు రవి మాదిగ, ఎమ్మార్పీఎస్ వరంగల్ మండల అధ్యక్షులు పెండ్యాల కొమురయ్య మాదిగ,కొమ్ముల సందీప్ ,లింగాల రాజు,చిమ్మని వేణు,అడిచెర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు

## మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ను కలిసిన బిఆర్ ఎస్ నేతలు



**ఖమ్మం, నేటి శుభోదయ :**
ఖమ్మం నగరంలో గల 58వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ మాజీ టౌన్ ఈసి మెంబర్ 58 డివిజన్ ఇంచార్జ్ ఆరెంపల వీరభద్రం ఆధ్వర్యంలో వడ్డెర సంఘం నగర సీనియర్ అధ్యక్షులు, నాయకులు బత్తుల వీరన్న, బత్తుల ప్రసాద్ లు శుక్రవారం బిఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రివర్యులు రాష్ట్ర రవాణా శాఖ మాత్యులు, పెద్దలు పువ్వాడ అజయ్ కుమార్ ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని బిఆర్ఎస్ పార్టీలోకి సాదరంగా ఆహ్వానించడం జరిగింది. వారికి అన్ని రకాల బిఆర్ఎస్ పార్టీ అండదండలు ఉంటాయని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో 58వ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు వేముల రవికుమార్ పాల్గొన్నారు.

## భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి సంరక్షించాలి

### : ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్



**ఖమ్మం, నేటి శుభోదయ :**
భావితరాల సంక్షేమం కోసం, పర్యావరణ పరిరక్షణను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించి మొక్కలను పెద్ద ఎత్తున నాటి సంరక్షించాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ అన్నారు.శుక్రవారం ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సత్తుపల్లి పట్టణంలో విద్యార్థులు, యువత, ప్రజలతో జేవీఆర్ కళాశాల మైదానంలో నిర్వహించిన వనమహోత్సవ సభలో నిర్వహించిన కార్యమానికి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ముఖ్య అతిథిగా హాజరై సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ తో కలిసి ప్రారంబించారు. ముందుగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. అనంతరం జేవీఆర్ కళాశాల నుంచి పాత సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు. జానపద కళాకారుల ప్రదర్శనలు ర్యాలీకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఇంత భారీ స్థాయిలో, ఉత్సాహభరితంగా నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమంలో పాల్గొనడం తనకు ఉత్సాహం కలిగించిందని, ప్రజల భాగస్వామ్యం కలిగిన కార్యక్రమాన్ని చూస్తున్నానని సంతోషాన్ని వ్యక్త పరిచారు. కార్యక్రమం విజయవంతం కావడానికి కృషి చేసిన నిర్వాహకులకు, ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. వనమహోత్సవం అంటే కేవలం మొక్కలు నాటడం మాత్రమే కాదని, అది ఒక పండుగగా, సామాజిక బాధ్యతగా భావించాలని అన్నారు. దీపావళి, దసరా, సంక్రాంతి వంటి పండుగలను ఎలా ఆనందంగా జరుపుకుంటామో, అదే విధంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా పండుగలా నిర్వహించా లని పిలుపునిచ్చారు. చరిత్రలో చక్రవర్తి అశోకుడు ఒక వృద్ధుడు మొక్కలు నాటుతున్న దృశ్యాన్ని చూసి, తన కోసం కాకుండా భావితరాల కోసం మొక్కలు నాటుతున్నానన్న ఆ వృద్ధుడి మాటలతో స్ఫూర్తి పొంది తన రాజ్యం అంతటా రహదారుల వెంట విస్తృతంగా మొక్కలు నాటించే కార్యక్రమాన్ని చేపట్టిన విషయాన్ని కలెక్టర్ గుర్తు చేశారు. భావితరాల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవ కార్యక్రమం ద్వారా ప్రతి ఏడాది కోట్లాది మొక్కలు నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల ఫలితంగా రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరుగుతోందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పుల ప్రభావం తీవ్రంగా కనిపిస్తోందని, యూరప్‌లోని జర్మనీ వంటి దేశాల్లో కూడా తీవ్ర ఉష్ణోగ్రతల కారణంగా రహదారులు దెబ్బతినడం, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రకృతిని నిర్లక్ష్యం చేయడం, విచ్చలవిడిగా వనరులను వినియోగించడం వల్లే ఈ పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు.చెట్లు, పక్షులు, నేల, నీటి వనరులు, జీవ వైవిధ్యాన్ని కాపాడటం ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన భూమిని అందించగలమని కలెక్టర్ అన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, అది పెద్ద చెట్టుగా ఎదిగే వరకు సంరక్షించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడమూ అంతే ముఖ్యమని అన్నారు. వన మహోత్సవం ఒక ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, భావితరాల భవిష్యత్తును కాపాడే సామాజిక ఉద్యమమని పేర్కొన్నారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర అత్యంత కీలకమని, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు మొక్కల పెంపకమే శాశ్వత పరిష్కారమని అన్నారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్యమని, ప్రతి పౌరుడు తన ఇంటి వద్ద, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ రోజు మనం నాటే ప్రతి మొక్క రేపటి తరాలకు అమూల్యమైన ఆస్తి అని, ప్రకృతిని కాపాడితేనే ప్రకృతిమనలను కాపాడుతుందని, పచ్చదనం పెరిగితేనే ఆరోగ్యకరమైన సమాజం, సురక్షితమైన భవిష్యత్తు సాధ్యమవుతుందని ఎమ్మెల్యే అన్నారు.సత్తుపల్లి నియోజకవర్గం విద్య, అభివృద్ధి, సామాజిక చైతన్యంలో ముందంజలో ఉందని, ఈ భారీ వనమహోత్సవ ర్యాలీ రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపును పొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, జిల్లా అటవీ అధికారి అనూజ్ అగర్వాల్, ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ భాద్యులు మట్టా దయనంద్, ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

## నున్నా ప్రదీప్ దాతృత్వం గొప్ప అభినందనీయం

### -పి అర్ పి ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి)

**ఖమ్మం, నేటి శుభోదయ :**
తల్లాడ మండలంలోని తెలగవరం ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం హెల్పింగ్ హాండ్స్ సంస్థ సభ్యులు నున్నా ప్రదీప్ రిటైర్డ్ టీచర్ కుమారుడు నున్నా సాత్విక్(ఎన్ ఆర్ ఐ ) వారి మాతృమూర్తి నున్నా సుజాత జ్ఞాపకార్ధం పదిహేను వేల రూపాయల విలువైన అహుజా మైక్ సెట్ ను కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా హాజరైన నూతనకల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు ఏ రమేష్,పి ఆర్ పి ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) చేతులమీదుగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమిరెడ్డి అచ్చిరెడ్డి, ఉపాధ్యాయులు అద్దంకి గోపాల క్రిష్ణ లకు అందించారు.ఈ సందర్భంగా పిఆర్ పి ఏ జిల్లా కన్వీనర్ యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) మాట్లాడుతూ ఈ పాఠశాల అభివృద్ధి కోసం ఆవాస ప్రాంతంలోని పెద్దల సహకారంతో 7 మంది నూతన విద్యార్థుల అడ్మిషన్లు చేసిన పాఠశాల ఉపాధ్యాయులు అభినందనీయులని తెలిపారు. అదేవిధంగా పాఠశాల అవసరాల నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన నున్నా ప్రదీప్ దాతృత్వం గొప్ప అభినందనీయమని తెలిపారు. నూతనకల్ ప్రధానోపాధ్యాయులు ఏ రమేష్ మాట్లాడుతూ జిల్లాలో చాలా పాఠశాలలకు మౌలిక వసతులు సమకూర్చటం లో యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) చేసిన కృషికి అభినంద నీయులని, ఉద్యోగ విరమణ పొందినప్పటికీ ఉపాధ్యాయుల కోసం, పాఠశాలల కోసం అనునిత్యం కష్టపడుతున్నారని తెలిపారు .ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వేమిరెడ్డి అచ్చిరెడ్డి, పిఆర్ టి యు టి ఎస్రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రాయల నరసింహారావు, పిఆర్ టి యు టి ఎస్ తల్లాడ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శ లు ఉంగరాల వెంకటేశ్వర్లు, అద్దంకి గోపాల క్రిష్ణ , గ్రామ సర్పంచ్ భూక్యా కాళోజి, ఉప సర్పంచ్ సిలివేరు నరసింహ రావు, తూము నరసింహ రావు , ముదిగొండ తిరుపతి రావు , అనుమోలు రాఘవ రావు, నేలపట్ల మహేష్ పాల్గొన్నారు .



## ఆంధ్ర టు తెలంగాణ ఇసుక అక్రమ రవాణా

### - నలుగురు అరెస్ట్

**వైరా, నేటి శుభోదయ :**
ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలతో పాటు, ఓ లారీకి ఎస్కార్ట్ వాహనంగా ఉన్న కారును వైరా పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ అక్రమ వ్యాపారాన్ని నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులపై కేసు నమోదు చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. అరెస్ట్ అయిన నలుగురు వ్యక్తులను పోలీసులు మధిర కోర్టులో రిమాండ్ పంపారు. ఈ అక్రమ వ్యాపారం చేస్తున్న వారు పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు నిరంతరం లారీలు, ఎస్కార్ట్ వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్లు మార్చేందుకు వీరి వద్ద ఉన్న రేడియం స్టిక్కర్లు సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వైరా మండలం సోమవరం గ్రామం గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ పోలీస్ చెక్పోస్ట్ వద్ద ప్రభుత్వ అనుమతులు లేకుండా ఏపీ నుండి హైదరాబాదుకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు లారీలను ఎస్కార్ట్ గా వస్తున్న కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు ఇసుక రీచ్ నుంచి హైదరాబాద్ కు నిరంతరం ఇసుక అక్రమ రవాణా జరుగుతుంది. దీంతో వైరా ఎస్సై పుష్పాల రామారావు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సోమవరం గ్రామ సమీపంలో ఉన్న గ్రీన్ ఫీల్డ్ హైవే ఎగ్జిట్ రోడ్డు వద్ద వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కొవ్వూరు నుంచి హైదరాబాద్ కు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు లారీలను, ఎస్కార్ట్ గా ఉన్న ఒక స్విఫ్ట్ డిజైర్ కారును పోలీసులు పట్టుకుని సీజ్ చేశారు. అంతేకాకుండా పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు లారీలు, ఎస్కార్ట్ గా ఉన్న కారు నెంబర్లను నిరంతరం మార్చేందుకు ఉపయోగించే రేడియం స్టిక్కర్లను స్వాధీనం చేసుకున్నారు.ఈ అక్రమ రవాణాకు పాల్పడుతున్న నల్గొండ జిల్లాకు చెందిన లారీ యజమానులు, డ్రైవర్లు ఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు. చేశారు. వీరిలో బచ్చుబోయిన యాదయ్యఇస్లావత్ భిక్షు, ముక్కుమాల యాదయ్య, దామ సైదులు, వాంకుడోత్ లింగా నాయక్, బచ్చుబోయిన యాదయ్యలపై వైరా పోలీసులు కేసు నమోదు చేశారు.






వీరిలో బచ్చుబోయిన యాదయ్య పరారీలో ఉండగా మిగిలిన నలుగురిని అరెస్టు చేసి మధిర కోర్టులో రిమాండ్ కు పంపారు. ఈ సందర్భంగా ఎస్సై పుష్పాల రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాల మేరకు చెక్పోస్టుల వద్ద తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు ప్రధానంగా ఆంధ్రప్రదేశ్ నుంచి ఇసుక అక్రమ రవాణాపై నిరంతరం నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు. ఇసుక అక్రమ రవాణా సమాచారాన్ని ప్రజలు పోలీసులకు అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ పవన్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## సదాశివపేటలో కిండర్‌బాట్స్ AI & రోబోటిక్స్ ప్రీ స్కూల్ ను ప్రారంభించిన రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు

**సంగారెడ్డి, నేటి శుభోదయ :**
సదాశివపేట పట్టణంలోని గాంధీ చౌక్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారతదేశపు తొలి AI & రోబోటిక్స్ ప్రీ స్కూల్ కిండర్‌బాట్స్ (KinderBots) తన కొత్త బ్రాంచ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పాల్గొని ప్రారంభించడం జరిగింది. ఇట్టి సందర్భంగా పులిమామిడి రాజు మాట్లాడుతూ భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ఆధునిక బాల్య విద్యను పట్టణంలోని చిన్నారులకు అందించడమే లక్ష్యంగా ఈ ప్రీ స్కూల్ ప్రారంభమైనదని, 2 నుండి 6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం రూపొందించిన ఈ ప్రీ స్కూల్‌లో AI & రోబోటిక్స్ లెర్నింగ్, STEM ఎడ్యుకేషన్, ఆటల ద్వారా అభ్యాసం (Play-Based Learning), ఎయిర్ కండీషన్డ్ క్లాస్‌రూమ్స్, ఆకర్షణీయమైన థీమాటిక్ క్లాస్‌రూమ్ డిజైన్స్ వంటి సదుపాయాలతో సురక్షితమైన, ఆనందకరమైన వాతావరణంలో విద్య అందించబడుతుందని,చిన్నారుల్లో సృజనాత్మకత, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, విమర్శనాత్మక ఆలోచన మరియు సమస్యల పరిష్కార సామర్థ్యాలను చిన్న వయస్సు నుండే పెంపొందించే విధంగా ప్రత్యేకమైన కరికులమ్ రూపొందించబదన్నారు.ఈ సందర్భంగా యాజమాన్యం మాట్లాడుతూ, “ఒత్తిడి లేని విద్య (No Stress Education)” అందించడమే కిండర్‌బాట్స్ లక్ష్యమని, ఆనందకరమైన అభ్యాసాన్ని ఆధునిక టెక్నాలజీతో కలిపి పిల్లలను భవిష్యత్తుకు సిద్ధం చేస్తామని తెలిపారు. ప్లే గ్రూప్, నర్సరీ, ఎల్‌కేజీ మరియు యూకేజీ తరగతులకు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని అడ్మిషన్స్ వివరాలకు మ్యానేజింగ్ డైరెక్టర్ జీర్లపల్లి సందీప్ & స్వాతిలను సంప్రదించాలని పులిమామిడి రాజు అన్నారు. ఇంత చక్కటి స్కూల్ ని ఏర్పాటు చేసినందుకు వారిని పులిమామిడి రాజు అభినందించారు. ఇట్టి కార్యక్రమంలో జీర్లపల్లి సందీప్, స్వాతి, మన్నె మనోహర్, మద్దికుంట సర్పంచ్ దేవి సింగ్, తాలెల్మా రాము, నరేష్ మొదలగు వారు పాల్గొన్నారు.



# ప్రభుత్వ వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక దృష్టి

## - ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి రామారావు

**ఖమ్మం, నేటి శుభోదయ :** జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అన్ని వైద్య సంస్థల్లో సేవల నిర్వహణను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు.శుక్రవారం ఖమ్మం నగరంలోని వీడియోస్ కాలనీలో ఉన్న వేగ హోమియోకేర్ క్లినిక్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, అనంతరం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జిజిహెచ్), ఖమ్మంలో ఉన్న జిల్లా క్షయ వ్యాధి నివారణ కేంద్రం, పోలియెటివ్ కేర్ సెంటర్, డయాబెటిక్ సెంటర్, రేడియోలోజీ డిపార్ట్మెంట్లను సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, రోగుల నమోదు వివరాలు, చికిత్స విధానం, రికార్డుల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, అవసరమైన మందులు, పరికరాల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. రోగులకు వేచి ఉండే సమయాన్ని తగ్గిస్తూ సకాలంలో, నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదే విధంగా ప్రతి రోగికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందు



బాటులో ఉన్న వైద్య సేవలను పూర్తిస్థాయిలో అందించడంతో పాటు, పరిశుభ్రమైన వాతావరణాన్ని నిర్వహించాలని, రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని, సేవల నాణ్యతను మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు ఆదేశించారు.

# గిరిజన స్వాతంత్ర సమరయోధులు బిర్సాముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వండి

**చింతూరు, నేటి శుభోదయ :** చింతూరు లో గిరిజన స్వాతంత్ర సమర యోధుడు బిర్సా ముండా విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర గిరిజన మోర్చా ఉపాధ్యక్షులు పాయం వెంకయ్య ఒక లేఖను ఐటీడీఏ పీవో కు శుక్రవారం అందజేశారు. ఆ లేఖలో భారత స్వాతంత్ర ఉద్యమం లో పాల్గొన్న స్వాతంత్ర సమరయోధుడు భిర్సాముండా విగ్రహాన్ని ఇటీవలే భారత పార్లమెంటు ఆవరణలో ఆవిష్కరించి ప్రతీ సంవత్సరం సెప్టెంబర్ 14న నెల రోజులపాటు ఆయన మృతికి గుర్తుగా ప్రభుత్వం గిరిజన సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు . అటువంటి గొప్ప మహనీయుని విగ్రహాన్ని ఈమధ్యనే పాడేరులో కేంద్ర మంత్రివర్యులు ద్వారా విగ్రహావిష్కరణ చేశారని . అందులో భాగంగా చింతూరు మండల కేంద్రంలో భారతీయ జనతాపార్టీ గిరిజన మోర్చా రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో భిర్సాముండా విగ్రహాన్ని ఏర్పాటుకు నిర్ణయించామన్నారు . బిర్స ముండా విగ్రహాన్ని ఐటీడీఏ ముందు ప్రధాన రహదారి పక్కన, లేక ఎర్రంపేటలోని ఎస్టీ బాలికల సంక్షేమ కార్యాలయం ముందుగానీ ఏర్పాటు చేయుటకు తగిన సంపూర్ణ సహకారాన్ని అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ చింతూరు మండలం మాజీ అధ్యక్షులు డీవీఎస్ రమణారెడ్డి ( చిట్టిబాబు )ఉయిక రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.




# మంత్రి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** కోదాడ-ఖమ్మం హైవే సమస్యల పై రాష్ట్ర రెవిన్యూ, గృహా నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దృష్టికి తీసు కెళ్లారు. స్పందించిన మంత్రి నేషనల్ హైవే అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం నేలకొండపల్లి మండలం లోని గువ్వలగూడెం, ఆచార్లగూడెం, నేలకొండపల్లి పలు చోట్ల ఎన్.హెచ్. అధికారులు పర్యటించారు. చారిత్రక ప్రదేశం కలిగిన నేలకొండపల్లి కి ఎంట్రీ, ఎగ్జిట్ , లేకపోవటం వలన పర్యాటకులు, భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. చారిత్రిక ప్రదేశం లో ఉన్న నేలకొండపల్లి ప్రజలు ఏం పాపం చేసుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంట్రీ.. ఎగ్జిట్ తప్పకుండా ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి జెర్రిపోతుల అంజని, సోమనబోయిన సాయినవీన్, సీపీఎం పాలేరు డివిజన్ నాయకులు



ఏటుకూరి రామారావు, అబ్దుల్ నబీ, ఆమ్ ఆద్మీపార్టీ జిల్లా నాయకులు పసుమర్తి శ్రీనివాస్ లు డిమాండ్ చేశారు. లేని పక్షంలో అవసరమైతే డిల్లీలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. వారిని కలిసి ఫిర్యాదు లోని అంశాల పై చర్చించారు. సమస్యలను క్షేత్ర స్థాయిలో చూపించారు. సర్వీస్ రోడ్డు వెంట డ్రైనేజీ కట్టకపోవటంతో రోడ్డు పై వచ్చే వరద అంతా పంట పొలల్లోకి చేరి పంట నాశనం అవుతుందని దీంతో గత రేండెళ్ల గా సాగు చేయకుండా రైతులు మానేశారని పసుమర్తి శ్రీనివాస్ వారికి వివరించారు. పలుమార్లు అధికారుల కు చెప్పినా పట్టించుకోకుండా రైతుల పట్ల వివక్ష చూపుతున్నారని అగ్రహాం వ్యక్తం చేశారు. సమస్యలపై పూర్తి స్థాయిలో ఆరా తీశారు. వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. నివేదిక ను జాతీయ రహాదారి అథారిటీ ఉన్నాతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

# "ప్లాస్టిక్ వద్దు - పర్యావరణమే ముద్దు"

## - ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

**నిజామాబాద్, నేటి శుభోదయ :** అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవాన్ని పురస్కరించుకొని సత్యశోధక్ పాఠశాలలో జాతీయ హరిత దళం (ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నియంత్రణ అవగాహన కార్యక్రమం నిర్వహించడమైనది. పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య మాట్లాడుతూ, "ప్లాస్టిక్ కాలుష్యం నేటి ప్రపంచం ఎదుర్కొంటున్న తీవ్రమైన పర్యావరణ సంక్షోభం. ఒక్కసారి వాడి పడేసే ప్లాస్టిక్ సంచులు నేల, నీరు, గాలిని కలుషితం చేస్తూ జీవవైవిధ్యానికి, మానవ ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగిస్తున్నాయి" అని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి ఒక్కరూ తమ దైనందిన జీవితంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగించాలని ఆయన పిలుపునిచ్చారు. "షాపింగ్‌కు వెళ్లేటప్పుడు గుడ్డ సంచులు, కాగితపు సంచులను తప్పని



సరిగా వాడాలని, పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని,. ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులే మార్పుకు నాంది పలకాలి" అని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ నియంత్రణ, దాని దుష్ప్రభావాలపై రూపొందించిన అవగాహన గోడపత్రులను ప్రిన్సిపాల్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఎన్‌జీసీ ఇన్‌చార్జి ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు ఫామ్‌పై ఫొటో తప్పనిసరి తహశీల్దార్



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సిరికొండ మండలం లోని అన్ని గ్రామాల ప్రజలకు బీఎల్ఓలు పంపిణీ చేసిన ఎస్ఆర్ఆర్ ఫామ్స్‌లో ఓటర్లు తమ వివరాలతో పాటు ఖచ్చితంగా ఫొటోలు అతికించాలని తహశీల్దార్ ఆర్.రవీందర్ రావు సూచించారు. ఫొటో లేకపోతే వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ కావడం లేదన్నారు.శుక్రవారం ఆయన తాళ్ల రామడుగు గ్రామంలో క్షేత్రస్థాయి పరిశీలన చేసి, ఒక కుటుంబానికి చెందిన ఓటరు వివరాలను అప్‌లోడ్ చేయించారు. ప్రజలందరూ తమ వివరాల ఫామ్స్‌ను పూర్తి చేసి వెంటనే బీఎల్ఓలకు అందించాలని తహసీల్దార్ రవీందర్ రావు తెలిపారు

# వ్యవసాయ శాఖ ద్వారా పత్తి విత్తనాల సబ్సిడీపై పంపిణీ



**వైరా, నేటి శుభోదయ :** జాతీయ ఆహార భద్రత పథకం ఎన్ ఎఫ్ ఎస్ ఎన్ ఎం 2026-27 సంవత్సరానికిక పాస్ కాంతి పథకం ద్వారాపత్తిని ఆధునిక పద్ధతులైన అధిక సాంద్ర పద్ధతి మరియు దగ్గర సాళ్ల పద్ధతి ద్వారా సాగు చేయుటకు మన వ్యవసాయ శాఖ ద్వారా పత్తి విత్తనాలు 901 రూపాయలు విలువ చేసే పత్తి ప్యాకెట్ కేవలం ఒక్క రూపాయికి మాత్రమే ఇవ్వబడును ఈ పత్తిని సాగు చేయడం వలన ఎకరంలో మొక్కల సంఖ్యను పెంచుకొని పత్తి పంట కాలన్నీ 150 రోజులకు తగ్గించుకొని అధిక దిగుబడులను పొందవచ్చు.ఈ విధానంలో సాగు చేయడం వలన ప్రతి పంట మొత్తం ఒకేసారి పూత కాయ దశకు చేరి కాయలు అన్నీ ఒకేసారి పక్వానికి వచ్చి పత్తి తీయడం కూడా ఒకేసారి జరుగుతుంది దీని వలన అధిక దిగుబడి పొందవచ్చని ఈ విధానం వలన పత్తి పంటను నవంబర్ నెల చివరికల్లా పూర్తి చేసుకుని రెండో పంటగా యాసంగిలో అపరాల పంటలు గాని నూనె గింజలు పంటలు గాని సాగు చేయవచ్చుననిసూచించడం జరిగింది. ఇట్టి విధానంలో పండించడం వల్ల ఎకరానికి 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తద్వారా రైతు యొక్క నికర ఆదాయం రెట్టింపు అవుతుందని సూచించడం జరిగింది.కావలసిన రైతులు మీ వ్యవసాయ విస్తరణ అధికారి సంప్రదించాలని తెలిపారు

# డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రైతులకు వరి నాటే యంత్రం పంపిణీ



**నిజామాబాద్, నేటి శుభోదయ :** ధర్పల్లి మండలం ధమన్నపేట్ గ్రామంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించే లక్ష్యంతో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరి నాటే యంత్రం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. వార్డు సభ్యుడు నిమ్మల వినయ్ గౌడ్ రైతులకు ఈ యంత్రాన్ని అందజేశారు.వరి నాటే యంత్రం వినియోగంతో తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో నాట్లు వేయవచ్చని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. రైతులు ఆధునిక సాంకేతికతను ఉపయోగించి అధిక లాభాలు పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ యూత్ అధ్యక్షుడు రిక్కు దినాకర్, నవీన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతులు సద్వినియోగం చేసుకోవాలి : ఏఓ

**ఖమ్మం, నేటి శుభోదయ :** జాతీయ ఆహార భద్రత పథకం 2026–27 సంవత్సరానికి 'కపాస్ కాంతి పథకం' ద్వారాపత్తిని ఆధునిక పద్ధతులైన అధిక సాంద్ర పద్ధతి, దగ్గర సాళ్ల పద్ధతి ద్వారా సాగు చేయుటకు మన వ్యవసాయ శాఖ ద్వారా పత్తి విత్తనాలు 901 రూపాయలు విలువ చేసే పత్తి ప్యాకెట్ కేవలం ఒక్క రూపాయికి మాత్రమే ఇవ్వబడును అని తల్లాడ వ్యవసాయ శాఖ ఏఓ తాజుద్దీన్ తెలిపారు. ఈ పత్తిని సాగు చేయడం వలన ఎకరంలో మొక్కల సంఖ్యను పెంచుకొని పత్తి పంట కాలన్నీ 150 రోజులకు తగ్గించుకొని అధిక దిగుబడులను పొందవచ్చు. ఈ విధానంలో సాగు చేయడం వలన ప్రతి పంట మొత్తం ఒకేసారి పూత కాయ దశకు చేరి కాయలు అన్నీ ఒకేసారి పక్వానికి వచ్చి పత్తి తీయడం కూడా ఒకేసారి జరుగుతుంది దీని వలన అధిక దిగుబడి పొందవచ్చని ఈ విధానం వలన పత్తి పంటను నవంబర్ నెల చివరికల్లా పూర్తి చేసుకుని రెండో పంటగా యాసంగిలో అపరాల పంటలు గాని నూనె గింజలు పంటలు గాని సాగు చేయవచ్చునని సూచించడం జరిగింది. ఈ విధానంలో పండించడం వల్ల ఎకరానికి 12 నుంచి 13 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని తద్వారా రైతు యొక్క నికర ఆదాయం రెట్టింపు అవుతుందని సూచించడం జరిగింది.కావలసిన రైతులు మీ వ్యవసాయ విస్తరణ అధికారి మండలవ్యవసాయ అధికారి ని గానీ సంప్రదించ గలరు అని తెలిపారు.

## చెత్త రిక్షాలతో రెక్కీ, దేవాలయం లో చోరీ, తరిమిన గ్రామస్తులు

**నేలకొండపల్లి, నేటి శుభోదయ :** చెత్త ఏరుకునే వారే కదా అని నిర్లక్ష్యంగా ఉండకండి. రెక్కీ నిర్వహించి చోరీలకు యత్నిస్తున్నారు. ఇదే తరహా లో చోరీ చేసి పట్టుబడ్డ దొంగను గ్రామస్తులు తరిమిన ఘటన మండలం లో చోటు చేసుకుంది. స్థానికుల కధనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నేలకొండపల్లి మండలం లోని శంకరగిరితండా లో గత వారం రోజుల క్రితం చెత్త రిక్షా తో గ్రామానికి అపరిచితుడు వచ్చాడు. గ్రామస్తులతో చెత్త ఎరుకునే జీవించే వాడను అంటూ పరిచయం చేసుకుని దేవాలయంలో నివాసం ఉంటున్నాడు. అందరని నమ్మించి శుక్రవారం దేవాలయం లో చోరీ యత్నించాడు. అది ఫలించకపోవటంతో చివరకు దేవాలయంలో ఉన్న మైక్ సెట్ (యాంపిల్యర్) ను చోరీ చేశాడు. దానిని చెత్త రిక్షా తో వేసుకుని తీసుకెళ్తున్నాడు. గ్రామస్తులకు అనుమానం వచ్చి రిక్షాను అడ్డుకుని తనిఖీ చేయటంతో చెత్త లో యాంప్లిపేయర్ కనిపించింది. దీంతో గ్రామస్తులు నిలదీయటంతో దొంగతనం ను ఒప్పుకున్నాడు. అందరి కాళ్ల పై పడి ప్రాధేయపడటంతో స్థానికులు ఇక్కడ కనిపించవద్దని ఊరి నుంచి తరిమేశారు. గ్రామంలో వారం రోజులు అనుమానంగా తిరిగినట్లు గ్రామస్తులు ఆరోపించారు. రెక్కీ నిర్వహించి, చోరీకి సాధ్యం కాక వదిలేసి ఉంటాడని గ్రామస్తుల మధ్య చర్చ సాగింది. అందుకే అనుమానితుల పట్ల అప్రమతండా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



## అన్నా - అక్క మెంటర్‌షిప్ ఇంటర్న్‌షిప్‌కు శ్రీకారం



**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న అన్నా–అక్క మెంటర్‌షిప్ – కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ టీచింగ్ ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు జిల్లాలోని 21 ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్న్‌షిప్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బండి రాజు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యార్థుల్లో డిజిటల్ పరిజ్ఞానం పెంపొందడంతో పాటు కళాశాల విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా ఇంటర్న్‌షిప్‌ను పూర్తి చేసి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు.కళాశాల నుంచి ఎంపికైన విద్యార్థులను జిల్లాలోని 21 ప్రభుత్వ పాఠశాలలకు కేటాయించినట్లు తెలిపారు. వారు పాఠశాల విద్యార్థులకు కృత్రిమ మేధస్సు (ఏఐ), డిజిటల్ అక్షరాస్యత, సాంకేతిక నైపుణ్యాలు, డిజిటల్ లెర్నింగ్ అంశాలపై అవగాహన కల్పించనున్నారు.ఈ కార్యక్రమాన్ని కళాశాల నోడల్ అధికారులు డా. కె. హరిత, జి. స్వాతి, డా. జి. మల్లిక సమన్వయం చేస్తున్నారు. ఇంటర్న్‌షిప్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వారు తెలిపారు.

## మసూద్ అందించిన సేవలు చిరస్మరణీయం



**కొత్తగూడెం, నేటి శుభోదయ :** సీనియర్ కాంగ్రెస్ నాయకులు మసూద్ మృతి కొత్తగూడెం పట్టణ ప్రజలకు తీరని లోటని, పట్టణ ప్రజలకు ఆయన అందించిన సేవలు ఎల్లప్పుడూ స్మరణీయంగా ఉంటాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివ రావు అన్నారు. రోడ్డు ప్రమాదానికి గురై తీవ్ర అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందిన కొత్తగూడెం పట్టణం, గణేష్ బస్తీకి చెందిన షేక్ మసూద్ పార్థివ దేహాన్ని ఆయన సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదం రూపంలో ఒక ఉత్తమ నాయకుడిని కోల్పోవడం అత్యంత బాధాకరమన్నారు. పార్టీలకు అతీతంగా నివాళులర్పించిన ఆయన, ఇద్దరు పిల్లలున్న మసూద్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కాగా, ప్రస్తుతం మసూద్ భార్య జయంతి మసూద్ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 54వ డివిజన్ కార్పొరేటర్‌గా కొనసాగుతున్నారు. నివాళులరించినవారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్లు బోయిన విజయ్ కుమార్, బండి నర్సింహా, నాయకులు ఎండి యూసుఫ్, పల్లపోతు సాయి, పి సత్యనారాయణచారి, నయీమ్ ఖురేషి, ఇర్ఫాన్, ధన్ రాజ్, అస్మత్, ఇమ్రాన్ తదితరులు వున్నారు.

## కామ్రేడ్ అరుణోదయ నాగన్న కన్నుమూత

### : విప్లవ లోకానికి తీరని లోటు






**తిరుమలాయపాలెం, నేటి శుభోదయ :** అరుణోదయ వ్యవస్థాపక నాయకులు, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ అరుణోదయ నాగన్న (శుక్రవారం) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన, ఖమ్మంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు.నాగన్న మరణం విప్లవ పోరాట లోకానికి తీరని లోటని పాలేరు నియోజకవర్గ ప్రజా సంఘాల జేఏసీ అధ్యక్షుడు మందడి ఇజ్రాయిల్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. నాగన్న మృతికి సంతాపం తెలుపుతూ ఆయన విప్లవ జోహార్లు అర్పించారు.ప్రజా ఉద్యమాలకు నాగన్న చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తుచేసుకున్న ఇజ్రాయిల్, ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

## జర్నలిస్ట్ కేవీర్‌ను వెంటనే విడుదల చేయాలి

### : ప్రజా సంఘాల ఐక్యవేదిక అధ్యక్షులు మందడి ఇజ్రాయెల్

**తిరుమలాయపాలెం, నేటి శుభోదయ :** హైదరాబాద్‌లో డిజిటల్ మీడియా జర్నలిస్ట్ యూనియన్ (డీఎంజేయూ)కు చెందిన జర్నలిస్ట్ కేవీర్ నివాసంలోకి ఏపీ పోలీసులు ప్రవేశించి వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక (జేఏసీ) పాలేరు నియోజకవర్గ అధ్యక్షులు మందడి ఇజ్రాయిల్ తీవ్రంగా ఖండించారు. యూనిఫాం లేకుండా, మహిళా పోలీసులు లేకుండానే ఇంట్లోకి ప్రవేశించడం, కుటుంబ సభ్యులతో దురుసుగా ప్రవర్తించడం మానవ హక్కుల ఉల్లంఘన అని పేర్కొన్నారు. తెలంగాణ జర్నలిస్టులను లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు నమోదు చేయడం, అర్ధరాత్రి అరెస్టులకు పాల్పడడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకుండా చట్టబద్ధ ప్రక్రియను పాటించకుండా ఏపీ పోలీసులు వ్యవహరించడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని, తెలంగాణ ప్రభుత్వం వెంటనే స్పందించి రాష్ట్ర గౌరవాన్ని కాపాడాలని కోరారు. జర్నలిస్ట్ కేవీర్‌ను వెంటనే బేషరతుగా విడుదల చేయాలని, ఈ ఘటనకు బాధ్యులైన పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే పత్రికా స్వేచ్ఛను పరిరక్షించి జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కోరింది.



## ఏఐటీయూసీ జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

**నేరేడ్ మెట్, నేటి శుభోదయ :** ఏఐటీయూసీ మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా నాలుగో మహాసభను ఈ నెల 11న యాప్రాల్‌లోని బాపూజీనగర్ కమిటీ హాల్‌లో ఘనంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో, మల్కాజిగిరి ప్రాంతానికి చెందిన ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభను విజయవంతం చేయాలని సీపీఐ మల్కాజిగిరి మండల కార్యదర్శి కాసర్ల నాగరాజు పిలుపునిచ్చారు.శుక్రవారం కాకతీయనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దేశంలోనూ రాష్ట్రంలోనూ కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోందన్నారు. గతంలో కార్మిక ఉద్యమాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా కుదించి కార్మికుల హక్కులను హరించే విధంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ చట్టాలతో కార్మికులను యాజమాన్యాల ముందు బానిసలుగా నిలబెట్టే పరిస్థితి ఏర్పడిందన్నారు.మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యాసంస్థలు, ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు, ఆటో రంగం, ఆశ, అంగన్‌వాడీ, మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారానికి ఏఐటీయూసీ నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు.సీపీఐ మండల సహాయ కార్యదర్శి కె. అశోక్‌కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో కనీస వేతనాలను పెంచడంతో పాటు కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, పండుగ సెలవులు, జాతీయ మరియు ఆర్జిత సెలవుల అమలుకు జిల్లా మహాసభలో తీర్మానాలు చేసి ఉద్యమాలను మరింత బలోపేతం చేస్తామని పేర్కొన్నారు.అనంతరం కాకతీయనగర్ భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా జే. వెంకటరమణ, అధ్యక్షుడిగా కన్నెగంటి ఆనంద్, ప్రధాన కార్యదర్శిగా చిలుమూరి ఆనందరావు, కోశాధికారిగా ఎస్.కె. ఖాసిం, ఉపాధ్యక్షుడిగా కె. మాధవ్, సహాయ కార్యదర్శులుగా డి. కిష్టయ్య, వి. వెంకట్రావును ఎన్నుకోగా, మరో 21 మంది సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు.ఈ సమావేశంలో యు. మాలకొండయ్య, డి. వెంకటేశ్వర్లు, యు. శ్రీను, టి. పేరయ్య, టి. శ్రీను, టి. రమేష్, కె. శ్రీహరి, పి. బాలాజీ, కె. శంకర్ తదితరులు పాల్గొన్నారు.



Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేయాలి




**వైరా, నేటి శుభోదయ :** వైరా మండలంలో ఉపాధ్యాయుల సర్వీస్ పరమైన అంశాల పరిష్కారం కోసం, పాఠశాలల అభివృద్ధి కోసంరెండురోజులపాటు పిఆర్టియు వైరా మండల శాఖ ఆధ్వర్యంలో క్యాంపెయినింగ్ నిర్వహించి అన్ని పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా యలమద్ది వెంకటేశ్వర్లు వైవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పి ఆర్ టి యు ముందుంటుందని, ఉపాధ్యాయులందరూ అంకిత భావంతో పని చేస్తున్నారనిఉపాధ్యాయులకు రావలసిన న్యాయపరమైన ఆర్థిక అంశాలను ప్రభుత్వం త్వరగా మంజూరు చేయాలని కోరారు. సిపిఎస్ ఉపాధ్యాయులకు కొత్త పెన్షన్ విధానం అమల్లోకి తీసుకొని రావాలని ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల హెల్త్ కార్డ్స్ మరియు హాస్పిటల్స్ విధివిధానాలను త్వరగా నిర్ణయించి అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు వైరామండల అధ్యక్షులు వెలిశెట్టి. నరసింహారావుప్రధాన కార్యదర్శి వేమిరెడ్డి గోవర్ధన్ రెడ్డి, జిల్లా కార్యదర్శి యన్.జాన్, వాలి. పెనుగొండ ఉపేందర్ రావ్ సురేష్ బి.పుల్లారావు, రామకృష్ణఎ.రఘు, ఎ.రవికుమార్ యమ్.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు

# దారూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన డిఎంహెచ్ఓ - డాక్టర్ సుధాకర్ లాల్






**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా దారూర్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ఆరోగ్య అధికారి సుధాకర్ లాల్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో నిర్వహిస్తున్న సేవలు, రోగుల హాజరు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండటంతో పాటు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రూపురేఖలు కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేయడం పట్ల ఆయన అభినందనలు తెలిపారు. ముఖ్యంగా ఓపీ విభాగాన్ని మెరుగుపరచి ప్రజలకు సౌకర్యవంతమైన వైద్య సేవలు అందిస్తున్న తీరు ప్రశంసనీయమని పేర్కొన్నారు.డాక్టర్ శాంతి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆసుపత్రి రూపురేఖలు పూర్తిగా మారిపోయాయని, ఓపీ సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని అధికారులు వెల్లడించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న అన్ని వసతి సౌకర్యాలను జిల్లా ఆరోగ్య అధికారి స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ శాంతి, ఆసుపత్రి సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. అనంతరం జిల్లా ఆరోగ్య అధికారిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీ రోడ్ల గోవర్ధన్ గారికి ఘన సన్మానం



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సిరికొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీ రోడ్ల గోవర్ధన్ ను ఈరోజు మండల కేంద్రంలో సిరికొండ మండల యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సన్మానించడం జరిగింది.ఈ సందర్భంగా సిరికొండ ఉపసర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు అయినాల శ్రీకాంత్ మాట్లాడుతూ, "కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలపై అచంచలమైన విశ్వాసంతో, ప్రజల మధ్య నిరంతరం ఉంటూ పార్టీ బలోపేతానికి అలుపెరగని కృషి చేస్తున్న నిఖార్సైన ప్రజా నాయకుడు రోడ్ల గోవర్ధన్ గారు. ఆయన నిబద్ధత, అంకితభావం యువతకు ఆదర్శంగా నిలుస్తాయి. ఆయన నాయకత్వంలో సిరికొండ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కావాలని ఆకాంక్షిస్తున్నాను. పార్టీ అభివృద్ధికి ఆయన మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని అన్నారు.ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్ రాము మొట్టల, నరేష్ గురజాల, ధోని మోహన్, సుమన్, కేతవత్ తిరుపతి, రాజేష్, రమేష్ తదితరులు పాల్గొని గోవర్ధన్ గారిని ఘనంగా సత్కరించారు.

# రైతుల సమస్యల పరిష్కారానికి వారధిగా నిలిచిన షాద్నగర్ ఎమ్మెల్యే



**నిజామాబాద్, నేటి శుభోదయ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు–2 నిర్మాణానికి సంబంధించి షాద్ నగర్ నియోజక వర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం వెలువడింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చుక్కమెట్టు, ముటుపూరు, ఉమ్మెంతాల, లాలాపేట, తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతుల తరపున అధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు. గతంలో అధికారులు ఆయా గ్రామాల్లో సర్వేలు నిర్వహించి, భూ సర్వే నంబర్లను ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించగా, రైతుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చలు జరిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత తదితర అధికారుల సమక్షంలో రైతులతో కలిసి సుమారు మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. రైతుల అభిప్రాయాలు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ఎకరానికి రూ.40 లక్షల నష్టపరిహారంతో పాటు హెచ్ఎండిఏ పరిధిలో ఒక ప్లాటు కేటాయించే విధంగా అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయంతో భూములు కోల్పోతున్న రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో చర్చలు జరిపి మెరుగైన నష్టపరిహారం సాధించిపెట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రజాప్రతినిధి కూడా ఈ స్థాయిలో రైతుల తరపున అధికారులతో చర్చలు జరపలేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొవ్వూరి పురుషోత్తం రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు..

# లొంకా రామస్వామి ఆలయంలో గాడ్కోల్ గ్రామ కమిటీ ప్రత్యేక పూజలు

## - వర్షాల కోసం 'వరద పాశం' నివేదన



**నిజామాబాద్, నేటి శుభోదయ :** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, గ్రామం సుభిక్షంగా ఉండాలని కాంక్షిస్తూ ఈరోజు స్థానిక లొంకా రామస్వామి ఆలయంలో గాడ్కోల్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వాన దేవుడి కరుణ కోసం స్వామివారికి సాంప్రదాయబద్ధంగా 'వరద పాశం' పోసి మొక్కుబడులు చెల్లించుకున్నారు.ఈ పూజా కార్యక్రమంలో గ్రామ కమిటీ చైర్మన్ సంతోష్ రెడ్డి, ప్రముఖ నాయకులు కెపత్ రెడ్డి, ప్రశాంత్, రాజమోహన్, నందమయ్య మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ కమిటీ ప్రతినిధులు మాట్లాడుతూ... ప్రకృతి కరుణించి, పంటలు బాగా పండాలని, రైతాంగం సంతోషంగా ఉండాలని లొంకా రామస్వామిని వేడుకున్నట్లు తెలిపారు. గ్రామంలో వర్షభావ పరిస్థితులు తొలగిపోయి, అందరికీ మంచి జరగాలనే సంకల్పంతోనే ఈ 'వరద పాశం' కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ పూజలో పాల్గొన్న గ్రామ ప్రజలందరికీ తీర్థప్రసాదాలు అందజేశారు.

# పలు దేవాలయాలలో ఘనంగా చతుర్థి పూజలు





**మంథని, నేటి శుభోదయ :** నిజ జేష్ఠ మాసంలో వచ్చిన సంకష్టహర చతుర్థి ఎంతో పవిత్రమైనది. నాలుగు సంవత్సరాలకు ఒకసారి వచ్చే అధికమాసంలో శ్రీ గణనాథుని పూజిస్తే అంతా శుభం జరుగుతుంది. సంకష్టహర చతుర్థి సందర్భంగా శుక్రవారం గణనాథుని ఆలయములో భక్తులు విగ్నేశ్వరుని దర్శించుకుని పునీతులయ్యారు.వాగుగడ్డ సమీపంలోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దైనందిన జీవితంలో మానవులు ఎదుర్కొంటున్న సమస్యలన్నీ సంకష్టహర చతుర్థి దీక్షతో తొలగిపోతాయి. కొత్తగా చతుర్థి దీక్ష తీసుకునేవారు అధిక మాసంలో వచ్చే చతుర్థి రోజున దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయస్కారం. ప్రతి మనిషి తన జీవితంలో ఎదుర్కొంటున్న సమస్యలు తీరడానికి సంకష్టహర చతుర్థి రోజున ఉపవాస దీక్ష తీసుకోవడం ఎంతో శ్రేయస్కారం. సంకష్టహర చతుర్థి రోజున శ్రీ విఘ్నేశ్వరుని పూజించి ఆలయంలో 21 ప్రదక్షిణాలు చేసి మోదకులు, ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే అన్ని సంకటాలు తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. నిజ జేష్ఠ మాసంలో వచ్చిన చతుర్థి ఎంతో విశిష్టమైనది. మంథని పట్టణంలోని శ్రీ మహా గణపతి దేవాలయంలో సిద్ధి, బుద్ధి సమేతంగా కొలువుతీరిన గణనాథున్ని సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గణపతికి ఇష్టమైన చవితి తిథి రోజున నవగ్రహాల్లోని కుజ గ్రహ దోషం పోవాలంటే "ఓం గం గణపతియై నమః " అని స్మరిస్తూ విఘ్నేశ్వరున్ని దర్శించుకుంటే అన్ని సంకటాలు తొలగిపోతాయి. ప్రతి నెలలో పౌర్ణమి తర్వాత వచ్చే చవితి తిథి రోజున సంకష్టహర చతుర్థి వస్తుంది. ఈ రోజున రాత్రి 9. 38 గంటలకు చంద్రోదయం అనంతరం స్వామివారికి పూజ చేసి భోజనం చేయడం ఎంతో శ్రేయష్కారం. ఈ రోజున ఉపవాస దీక్ష స్వీకరిస్తే జీవితంలో ఎదుర్కొంటున్న విఘ్నాలన్ని తొలగిపోతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఈ సందర్భంగా శ్రీ మహాగణత దేవాలయాన్ని ఎంతో అందంగా అలంకరించారు. దేవతలలో మొట్టమొదట పూజించబడే ఎంతో విశిష్టత కలిగిన శ్రీ విఘ్నేశ్వరున్ని పూజించడం వల్ల అన్ని కష్టాలు తొలగిపోయి అంతా శుభం జరుగుతుందనే విశ్వాసంతో సంకష్టహర చతుర్థి దీక్షను స్వీకరిస్తారు. ఈ రోజున విఘ్నేశ్వరునికి ఇష్టమైన గరిక ( దూర్వాలు ) సమర్పించడం అలాగే 21 ఉండ్రాళ్ళు నైవేద్యంగా సమర్పిస్తే విఘ్నేశ్వరునికి ప్రీతిపాత్రలవుతారు అని శాస్త్రాల్లో పేర్కొనబడింది. ఈ రోజున చంద్రోదయం అనంతరం భోజనం చేయడం ఈ దీక్షలో ప్రధానంగా చెప్పుకోవచ్చు. ఆలయ పూజారి పల్లి రాము భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు చేశారు.

# బోనమ్మతల్లి సహిత సప్తమాతృక విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవం - పాల్గొన్న గడ్డం ప్రసాద్ కుమార్





**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ ఆలంపల్లి గ్రామంలో బోనమ్మతల్లి సహిత సప్తమాతృక గ్రామదేవతా ఆలయ విగ్రహాల పునఃప్రతిష్ఠా మహోత్సవం భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన దేవతామూర్తుల ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.శుక్రవారం జరిగిన మహోత్సవ కార్యక్రమానికి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ హాజరై దేవతామూర్తులకు ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. గ్రామంలో శాంతి, సౌభాగ్యాలు నెలకొని ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో లంక లక్ష్మీకాంత్ రెడ్డి, అర్ధ సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం భక్తులతో నిండిపోగా గ్రామమంతా ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది.ఇలాంటి ధార్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు సాంప్రదాయ పరిరక్షణకు దోహదపడతాయని నాయకులు పేర్కొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు




**తలకొండపల్లి, నేటి శుభోదయ :** జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో శనివారం పీరికేటి దశరథం కుమారుడు అజయ్ మరియు ఆదిత్యల రిసెప్షన్ వేడుక జగబోయిన్ పల్లి గేట్ సమీపంలోని నూతన గార్డెన్ లో వైభవంగా జరిగింది.ఈ శుభకార్యానికి వెల్జాల్ గ్రామ నాయ కులు, తిరుమణి లచ్చయ్య గౌడ్, తిరుమణి శేఖర్ గౌడ్,శశి గౌడ్,ఆరిఫ్,శతాక్షి శ్రీనివాస్,తిరుమణి రాఘవేందర్ గౌడ్, విజయ్ యాదవ్ హాజరై నూతన వధూవరులను కలిసి,వారికి వివాహ శుభాకాంక్షలు తెలియజేస్తూ అక్షింతలు వేసి ఆశీర్వదించారు.అనంతరం వరుడి తండ్రి దశరథం మరియు వారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.అంతరం వెల్జాల్ గ్రామ సంతోజు పాల్గుణ చారి కుమారుడు శివ కుమార్ చారి మరియు శివతన్విక తలకొండపల్లి మండల కేంద్రంలోని దేవకి గార్డెన్ లో రిసెప్షన్ ఘనంగా నిర్వహించడం జరిగింది.నూతన వధూరంగా ఆశీర్వదించడం జరిగింది.ఈ కార్యక్రమంలో గ్రామ,స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాలతో సమీక్షా సమావేశం

### - జిల్లా విద్యాశాఖాధికారి శారద




**మంథని, నేటి శుభోదయ :** పెద్దపల్లి జిల్లా విద్యాశాఖాధికారి శారద మరియు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డా. పి. ఎం. షేక్ మంథని మండలంలోని ఎం.పి.పి.ఎస్. గౌతమీ నగర్ మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మంథనిలను సందర్శించి విద్యా కార్యక్రమాల అమలును క్షుణ్ణంగా పరిశీలించారు. మొదటగా ఎం.పి.పి.ఎస్. గౌతమీనగర్ పాఠశాలలో ఎఫ్ ఎల్ ఎన్ (ఫౌండేషనల్ లీటరసీ & నూమేరేసీ ) అమలు, బోధన–అభ్యసన ప్రక్రియను పరిశీలించారు. విద్యార్థులకు స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహించి వారి అభ్యాస స్థాయిని అంచనా వేశారు. అలాగే ప్రీ–ప్రైమరీ విభాగాన్ని సందర్శించి చిన్నారుల అభ్యాస వాతావరణం, కార్యకలాపాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులకు ఎఫ్‌ఎల్‌ఎన్ లక్ష్యాల సాధనకు అవసరమైన పలు విలువైన సూచనలు, సలహాలు అందించారు. తదుపరి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మంథనిలో లెర్నింగ్ ఇంప్రూవ్మెంట్ ప్రోగ్రామ్ (ఎల్ ఐ పి ) అమలు తీరును పరిశీలించారు. తరగతి గదిలో జరుగుతున్న బోధన–అభ్యసన ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించి, విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారి అభ్యాస పురోగతిని తెలుసుకున్నారు. విద్యార్థులకు స్పాట్ అసెస్‌మెంట్ నిర్వహించి అభ్యాస ఫలితాలను సమీక్షించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించి విద్యా ప్రమాణాల మెరుగుదల, విద్యార్థుల అభ్యాస ఫలితాల పెంపు, ఎల్ ఐ పి సమర్థవంతమైన అమలు, తరగతి గది బోధనలో నాణ్యత పెంపు, నిరంతర మూల్యాంకనం వంటి అంశాలపై సమగ్రంగా చర్చించి విలువైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రతి ఉపాధ్యాయుడు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని, ప్రతి విద్యార్థి అభ్యాస స్థాయిపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా విద్యాశాఖాధికారి శారద మరియు అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ డా. పి. ఎం. షేక్ సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మండల విద్యాధికారి లక్షి , సీ ఆర్ పీ లు పాల్గొన్నారు.

## మల్కాజ్‌గిరి అభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదనలు

### హౌసింగ్ కార్పొరేషన్ ఎండీని కలిసి వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



**మల్కాజ్‌గిరి, నేటి శుభోదయ :** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలో గృహ, ఆరోగ్య, తాగునీటి మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన పలు ప్రతిపాదనలను తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వీ.పీ. గౌతమ్, ఐఏఎస్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతిపత్రం ద్వారా సమర్పించారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎండీని కలిసి నియోజకవర్గానికి సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా అల్వాల్ ప్రాంతంలోని భూదాన్ భూముల సర్వే నంబర్లు 537, 538, 539, 540ల్లో పేద, మధ్యతరగతి కుటుంబాల కోసం రెండు పడక గదుల గృహాల నిర్మాణం చేపట్టాలని ఎమ్మెల్యే ప్రతిపాదించారు. అలాగే మౌలాలి ఆయుష్ వెల్‌నెస్ సెంటర్–యునాని ఆసుపత్రి పరిధిలోని హౌసింగ్ బోర్డు స్థలంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలని కోరారు.కౌకూర్ రాజీవ్ గృహకల్ప సముదాయంలో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించి శాశ్వత నీటి వసతి కల్పించేందుకు చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.వినతులను సానుకూలంగా పరిశీలించిన హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీ.పీ. గౌతమ్, సంబంధిత అధికారులతో సమీక్షించి సాధ్యమైన మేరకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడి మాట్లాడుతూ, మల్కాజ్‌గిరి ప్రజలకు మెరుగైన గృహ, ఆరోగ్య, తాగునీటి సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వ శాఖలతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

# కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ప్రారంభించిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి





**సంగారెడ్డి, నేటి శుభోదయ :** సంగారెడ్డి జిల్లా, కల్హేర్ పోలీస్ స్టేషన్ నూతన భవనాన్ని ముఖ్య అతిథిగా విచ్చేసిన నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్. తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జిల్లాల పునర్విభజన అనంతరం కొత్తగా ఏర్పడిన కల్హేర్ పోలీస్ స్టేషన్ తాత్కాలికంగా గ్రంథాలయ భవనంలో కొనసాగిందని, ప్రస్తుతం అన్ని సౌకర్యాలతో కూడిన నూతన భవనంలో సేవలు ప్రారంభించడం సంతోషకరమని అన్నారు. ఈ నూతన భవనం ద్వారా ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కల్హేర్ మండల ప్రజలు తమకు ఎలాంటి సమస్యలు ఉన్నా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ప్రజల ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని తెలిపారు.యువత చెడు వ్యసనాలకు, ముఖ్యంగా మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లాలో గంజాయి సాగు, మాదక ద్రవ్యాల విక్రయాలు, అక్రమ రవాణాను ఏమాత్రం సహించేది లేదని, జిల్లాలో ఎక్కడైనా గంజాయి సాగు, మాదక ద్రవ్యాల విక్రయాలు లేదా రవాణా జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే జిల్లా ఎస్–న్యాబ్ హెల్ప్‌లైన్ నంబర్ 8712656777కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.అనంతరం ముఖ్య అతిథి నారాయణఖేడ్ ఎమ్మెల్యే డా. పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో మౌలిక సదుపాయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవనం పోలీసు సిబ్బంది విధి నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు దోహదపడటంతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్ రెడ్డి, కంగ్టి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, కల్హేర్ ఎస్ఐ రవిగౌడ్, సిర్గాపూర్ ఎస్ఐ జి. మహేష్, కంగ్టి ఎస్ఐ దురారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## జీవో 641 రద్దు చేసే వరకు డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం ఆగదు

### - మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్




**షాద్నగర్, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలో సిద్దాపూర్ గ్రామంలో జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (డంపింగ్ యార్డ్) ఏర్పాటు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 641పై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈరోజు షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో సిద్దాపూర్, పరిసర గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం జీవో నం. 641ను జారీ చేయడం ప్రజావ్యతిరేక నిర్ణయమని విమర్శించారు. డంపింగ్ యార్డ్ జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, జీవో 641 ఉపసంహరించుకునే వరకు ప్రజలతో కలిసి అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా ప్రజలను చైతన్యపరుస్తూ, అవసరమైతే భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సిద్దాపూర్ ప్రజల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడతామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మెండే కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచులు వడ్డె బాలయ్య, రమేష్, చంద్రశేఖర్ తదితరులు, ఆయా గ్రామాల, తండాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

### - టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్





**ఏన్కూర్, నేటి శుభోదయ :** ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పిఆర్సీ కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, 2023 జులై నుండి అమలు కావాల్సిన నూతన పీఆర్సీ 36 నెలల కాలం పూర్తి అయినందున ప్రభుత్వం వెంటనే నివేదికను తెప్పించుకుని సంఘాలతో చర్చించి అమలు చేయాలని టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పారుపల్లి. నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. హెల్త్ కార్డుల విధివిధానాలు రూపొందించి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. సంఘ సభ్యత్వ క్యాంపైన్ మండలంలోని వివిధ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సమావేశాలలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల పెండింగ్ బిల్లులు అన్నీ క్లియర్ చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ ఉపాధ్యాయుల డిఎ బకాయిలు విడుదల చేయాలని, బకాయి ఉన్న ఐదు వాయిదాల డిఎ లను ప్రకటించాలని,హెల్త్ కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని, ఉపాధ్యాయుల సర్వీసు నిబంధనలను రూపొందించి పర్యవేక్షణ అధికారుల పదోన్నతులు చేపట్టాలని కోరారు. సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ పునరుద్ధరించాలని, 2003 డిఎస్సీ టీచర్లకు పాత పెన్షన్ అమలు చేయాలని, కెజిబివి, సమగ్ర శిక్షా ఉద్యోగులకు బేసిక్ పే ఇవ్వాలని,సమ్మె కాలపు వేతనం మంజూరు చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని సవరించి ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులను టెట్ నుండి మినహాయించాలని, బోధించే సబ్జెక్టులలో టెట్ పరీక్షలు నిర్వహించాలని, సర్వీస్ వెయిటేజ్ ఇవ్వాలని కోరారు. పాఠశాలలకు యూనిఫామ్స్, టెస్ట్ బుక్స్, వర్క్ బుక్కులు ,నోటు పుస్తకాలు వెంటనే సరిపడా సరఫరా చేయాలని, అల్పాహారాన్ని అందించాలని కోరారు. ఈ క్యాంపైన్లో జిల్లా కార్యదర్శి డిఎస్. నాగేశ్వరరావు, మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శులు రామ్ చంద్, పుల్లయ్య, మహమ్మద్ అలీ, రాఘవరావు, శ్రీనివాసరావు , అనురాధ, దివ్య తదితరులు పాల్గొన్నారు.

# న్యాయం జరగకపోతే ఆమరణ నిరాహార దీక్ష కైనా సిద్ధం ప్రాణాలైనా అర్పిస్తాం

- షాద్నగర్ బిజెపి నేత పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్
- అడ్వాన్స్ సర్టిఫికెట్ పొజిషన్ ద్వారా ఫిబ్రవరి 11న ప్రభుత్వం జిహెచ్ఎంసికి భూమిని అప్పజెప్పింది..
- ఈ జీవోల గురించి "ఎమ్మెల్యే శంకర్" కు తెలియదా..?
- నిన్న ప్రభుత్వం విడుదల చేసింది రెక్టిఫికేషన్ జీవో మాత్రమే
- 24 గంటల్లో ఎమ్మెల్యే శంకర్ రాజీనామా చేయాలి
- ఉద్యమాన్ని నీరుగార్చి అసలు విషయమే పక్కదో పట్టించిన ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి



**షాద్నగర్, నేటి శుభోదయ :** రంగారెడ్డి జిల్లా షాద్నగర్ నియోజకవర్గం కొత్తూరు మండలం పరిధిలోని సిద్ధాపూర్ భూములలో ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు 86 ఎకరాల భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది ఈ రోజు కొత్త విషయం కాదని 2026 ఫిబ్రవరి 11న మొదటి జీవో వచ్చిందని అయినా ఇక్కడ ఎమ్మెల్యే శంకర్ ఆ జీవోను ప్రజలకు తెలియకుండా ఇక్కడ ఆందోళనకారులను మభ్యపెట్టడానికి నాటకం ఆడారని ముందుగా సిద్ధపూర్ ప్రజలకు రైతులకు ఆయా గ్రామస్తులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ముక్కు నేలకు రాయాలని షాద్ నగర్ భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కొత్తూరు మండలం లోని సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదిత స్థలాన్ని స్థానికులతో కలిసి ఆయన సందర్శించారు. హైదరాబాద్ లో జవహర్ నగర్ డంపింగ్ యార్డ్ తరహాలో మరో వ్యర్థాల ప్రాసెసింగ్ ఫెసిలిటీ అందుబాటులోకి తేవడానికి ప్రభుత్వం రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని సిద్ధాపూర్ లో 86 ఎకరాల భూమిని ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్ (ఎస్.డబ్ల్యూ.ఎం) ఏర్పాటు కోసం జిహెచ్ఎంసికి కేటాయిస్తున్న పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసిందని ఏకో టౌన్ ప్రాజెక్టులో భాగంగా కేటాయించిన భూమిలో ఘన వ్యర్థాల నిర్వహణ సదుపాయం ఏర్పాటు చేసేలా హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ లిమిటెడ్ కు అనుమతి ఇచ్చారని విమర్శించారు. గత ఫిబ్రవరి 11వ తేదీన జిహెచ్ఎంసి కి అడ్వాన్స్ పొజిషన్ సర్టిఫికెట్ ద్వారా భూమిని అప్పగించారని ఈ సందర్భంగా పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. గత ఫిబ్రవరిలో మొదటి జీవో వచ్చిందని నిన్న రెక్టిఫికేషన్ (సవరణ) జీవో విడుదలైందని మరి ముందుగా వచ్చిన జీవో అంశం స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు తెలియదా? ఒకవేళ తెలిసినా ప్రజల ఉద్యమాలను చల్లారించేందుకు ఆయన డంపింగ్ యార్డ్ ను రానివ్వనని ప్రగల్భాలు పలికారా? అని విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజలను మభ్యపెట్టి ఉద్యమాలను ఉద్దేశపూర్వకంగా ఎమ్మెల్యే శంకర్ నీరుగార్చారని ఆరోపించారు. ప్రభుత్వంలో కీలక శాసనసభ్యుడిగా రాష్ట్రస్థాయిలో ఎల్లప్పుడూ ముఖ్యమంత్రితో మంచి సంబంధాలు కలిగిన ఎమ్మెల్యేకు తెలియకుండా ఇదంతా జరిగిందా? అని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అనుమానాలు వ్యక్తం చేశారు. "ఫ్రెండ్షిప్ అండ్ కో ఆపరేషన్" ఒప్పందంలో భాగంగా ఏకో టౌన్ ఏర్పాటుకు భూమి కేటాయించాలని 2025 ఆగస్టు 1న జిహెచ్ఎంసి కమిషనర్ టిజిఐఐసి ఎండికి లేఖ రాశారనీ రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం సిద్ధాపూర్ లోని సర్వేనెంబర్ 252, 258, 361 లోని 150 ఎకరాల భూమిని బదిలీ చేయాలని కోరారు. దీనికి స్పందించిన టిజిఐఐసి ఆయా సర్వే నెంబర్లలో 86 ఎకరాలను ఎలాంటి ఖర్చు లేకుండా జిహెచ్ఎంసి పేరిట బదిలీ చేసేందుకు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి టిజిఐఐసి వైస్ చైర్మన్ కు అనుమతి ఇచ్చానరన్నారు. దీంతో అడ్వాన్స్ పొజిషన్ సర్టిఫికెట్ ద్వారా భూమిని 2026 ఫిబ్రవరి 11న జిహెచ్ఎంసికి అప్పగించారని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యేకు తెలియకుండానే జీవో వచ్చిందా అని పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ ఉద్యమం ఇక ఆగదని అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని చివరకు తన ప్రాణ త్యాగం చేయడానికి అయినా తను సిద్ధమేనని విష్ణువర్ధన్ రెడ్డి ఘాటుగా స్పందించారు. 24 గంటల లోపు దీనిపై ఎమ్మెల్యే తదితర పాలకులు రాజీనామా చేయాలని వారికి సమయం ఇస్తున్నామని తమకు న్యాయం జరగకపోతే పెద్ద ఎత్తున మరో ఉద్యమం ప్రారంభం అవుతుందని హెచ్చరించారు..

# యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి - జిల్లా కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, నేటి శుభోదయ :** టేకులపల్లి మండలం జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన పీఏసీఎస్ ఎరువుల గిడ్డంగులు, ఎస్ఐఆర్ కార్యక్రమం, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాల ఆకస్మికంగా తనిఖీ. టేకులపల్లి మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం విస్తృతంగా పర్యటించి బొమ్మనపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పీఏసీఎస్) ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలు, 9వ మైలు తండాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం, టేకులపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ), జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలు తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించి సంబంధిత అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. బొమ్మనపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం బేతంపూడి ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ గిడ్డంగుల్లో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువుల స్టాక్‌ను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్‌లో నమోదైన వివరాలకు అనుగుణంగా నిల్వలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేసి, ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని రైతులకు పంపిణీ చేశారు, ప్రస్తుతం ఎంత నిల్వ ఉంది, ఇంకా ఎంత పరిమాణంలో ఎరువులు రావాల్సి ఉందనే వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును రైతుల మొబైల్ ఫోన్లలో స్వయంగా పరిశీలించారు. యాప్ ద్వారా యూరియాను ముందస్తుగా బుక్ చేసుకునే విధానాన్ని రైతులకు వివరించి, జిల్లాతో పాటు మండలంలో అందుబాటులో ఉన్న యూరియా నిల్వల వివరాలను కూడా యాప్ ద్వారా తెలుసుకోవచ్చని తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకతను పెంపొందించడంతో పాటు ఎరువులు పక్కదారి పట్టకుండా నిరోధించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు . యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించి, వినియోగించాలని సూచించారు.అనంతరం టేకులపల్లి మండలం 9వ మైలు తండాలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన, నమోదు ప్రక్రియను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో కార్యక్రమాన్ని నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బూత్ లెవల్ అధికారులు అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి ఎన్యూమరేషన్ ఫారాల సేకరణను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. మరణించిన ఓటర్ల వివరాలను పూర్తిగా ధృవీకరించి నిబంధనల మేరకు ఓటరు జాబితా నుంచి తొలగించాలని, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన ఓటర్ల వివరాలను కూడా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.అనంతరం టేకులపల్లి కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, కిచెన్ షెడ్, వంటశాల, పరిశుభ్రత, భోజన ఏర్పాట్లు, విద్యార్థినులకు అందిస్తున్న పోషకాహారాన్ని పరిశీలించారు. ఆర్వో ప్లాంట్ పనిచేయకపోవడంపై మండల విద్యాశాఖ అధికారిని ప్రశ్నించి, వెంటనే మరమ్మతులు పూర్తి చేసి విద్యార్థినులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. తొమ్మిదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విద్యార్థినులతో మాట్లాడి విద్యా సౌకర్యాలు, హాస్టల్ వసతులు, హాజరు, నూతన ప్రవేశాలు, అభ్యాస స్థాయి, ఉత్తీర్ణత శాతం, యూనిఫాంల పంపిణీ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి అందుబాటులో ఉన్న పరికరాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ విద్యార్థినులకు నాణ్యమైన ప్రాయోగిక విద్య అందించాలని అధ్యాపకులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో, పారదర్శకంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, యూరియా బుకింగ్ యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వినియోగంపై రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అలాగే ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయి పారదర్శకతతో నిర్వహించి, అర్హులైన ప్రతి ఓటరికి నమోదు అవకాశం కల్పించాలని అన్నారు . బీఎల్‌వోలు అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను ప్రజలు పూర్తిగా పూరించి నిర్ణీత గడువులోగా సమర్పించాలని సూచించారు. పాఠశాలల్లో ప్రతి విద్యార్థినికి నాణ్యమైన విద్యతో పాటు పరిశుభ్రమైన, సురక్షితమైన విద్యా వాతావరణం కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం పోషకాహారం, స్వచ్ఛమైన తాగునీరు, పరిశుభ్రమైన హాస్టల్ వసతులు, అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థినుల అభ్యాస సామర్థ్యాన్ని పెంపొందించడంతో పాటు హాజరు, ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపరిచేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, ప్రతి విద్యార్థిని ఉన్నత లక్ష్యాలను సాధించేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తాసిల్దార్ వీరభద్రం, మండల విద్యాశాఖ అధికారి జగన్, వ్యవసాయ శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి జైలు శిక్ష




**నిజామాబాద్, నేటి శుభోదయ :** మద్యం మత్తులో వాహనం నడిపిన వ్యక్తికి ఆర్మూర్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు 4 రోజుల జైలు శిక్ష విధించినట్లు నందిపేట ఎస్ఐ వినయ్ తెలిపారు.జూన్ 24న నందిపేటలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో కొమన్ పల్లికి చెందిన సాయిలు పట్టుబడ్డాడు.కేసును విచారించిన కోర్టు శుక్రవారం అతనికి 4 రోజుల జైలు శిక్ష విధించింది.మరో వ్యక్తికి రూ.10,000 జరిమానా విధించింది.మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని,తనిఖీల్లో పట్టుబడితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ వినయ్ హెచ్చరించారు.

# ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా కృషి చేయాలి - కలెక్టర్ ఇలా త్రిపాఠి




**నిజామాబాద్, నేటి శుభోదయ :** నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణం పెంపొందేలా ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు.క్షేత్ర స్థాయిలో రైతులను ప్రోత్సహిస్తూ జిల్లాలో ఈ సీజన్ లో 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో శుక్రవారం వ్యవసాయ,ఉద్యానవన శాఖల అధికారులతో,ఆయిల్ పామ్ నర్సరీని నిర్వహిస్తున్న ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఆయిల్ పామ్ సాగు పురోగతిపై క్లస్టర్ల వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ఏర్పాటు కోసం నందిపేట మండలం లక్కంపల్లి సెజ్ ప్రాంతంలో గుర్తించిన స్థలం అనుకూలతపై చర్చించారు.భవిష్యత్తులో ఇదే ప్రాంతంలో రిఫైనరీ ఏర్పాటుకు సైతం స్థలం అందుబాటులో ఉండడం,పొరుగు జిల్లాలకు సెంటర్ పాయింట్ కావడంతో లక్కంపల్లి సెజ్ స్థలం ఫాక్టరీ ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.అయితే ఆయిల్ పామ్ పంటను సేకరించే కలెక్షన్ సెంటర్లను రైతులకు అనువైన ప్రాంతాలలో అందుబాటులో ఉంచాలని ప్రీ-యునిక్ కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు.ఎంతో లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగును చేపట్టి రైతులు ఆర్థిక అభ్యున్నతి సాధించాలన్నదే ప్రభుత్వ సంకల్పమని,దీనిని దృష్టిలో పెట్టుకొని జిల్లాలో రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అన్నారు.ముఖ్యంగా మాక్లూర్,డొంకేశ్వర్,బాల్కొండ,ముప్కాల్,మెండోరా,సిరికొండ మండలాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని,ఒక్కో మండలంలో కనీసం 100 ఎకరాల విస్తీర్ణానికి తగ్గకుండా ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా చూడాలన్నారు.వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని అన్నారు.క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు రైతులను కలుస్తూ,ఈ పంట వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పించాలన్నారు.పై మండలాలలోని రైతు వేదికలలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ,ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు,మద్దతు ధర,సుదీర్ఘ కాలం పాటు ఏటేటా సమకూరే రాబడి,అంతర పంటల సాగుకు గల అవకాశాలు తదితర అంశాలను వివరించాలని,ఆదర్శ రైతులు ఈ పంటను సాగు చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చేలా అంకిత భావంతో కృషి చేయాలన్నారు.జిల్లాలో ఆయిల్ పామ్ సాగు కోసం సరిపడా మొక్కలు అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.ఎంతో లాభదాయకమైనందున ఈ పంట సాగు దిశగా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున తోడ్పాటును అందిస్తోందని,ఈ అవకాశాన్ని జిల్లా రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.సమావేశంలో ట్రైనీ కలెక్టర్ సురేష్,జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్,వ్యవసాయ శాఖ అధికారి వీరస్వామి,ప్రీ యునిక్ కంపెనీ ఏరియా మేనేజర్ సాయి కిరణ్,ఉద్యానవన,వ్యవసాయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రిన్సిపల్ కె విజయలక్ష్మి కి టీజీవో ఖమ్మం జిల్లా అభినందన




**ఖమ్మం, నేటి శుభోదయ :** ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రిన్సిపాల్ గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన విజయలక్ష్మి కి టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో జిల్లా కార్యవర్గం అభినందనలు తెలియజేశారు, ప్రభుత్వ బాలికల కళాశాల ను ఖమ్మంలో ముందు వరుసలో ఉంచాలని, కళాశాల అభివృద్ధికి అంకిత భావం కలిగిన ప్రిన్సిపల్ రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపల్లి శేషు ప్రసాద్, హౌస్ బిల్డింగ్ సొసైటీ కార్యదర్శి డాక్టర్ పి విజయ్ కుమార్, జి జే ఎల్ ఏ రాష్ట్ర కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, ప్రిన్సిపాల్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు కే ఎస్ రామారావు, వాసిరెడ్డి శ్రీనివాస్, జీజేఎల్ఏ జిల్లా అధ్యక్షులు ప్రమీల, పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యు. మహేష్, ప్రిన్సిపల్స్ విజయ కుమారి, సింహాచలం, టీజీవో కార్యవర్గ సభ్యులు జాన్ పాటిల్, చంద్రకళ, రామయ్య, ప్రిన్సిపల్స్, లెక్చరర్స్ శుభాకాంక్షలు తెలియజేసి ఘనంగా సన్మానించడం జరిగింది.

## జర్నలిస్టుల పిల్లలకు 100% ఫీజు రాయితీ కల్పించాలని డీఈఓకు వినతి



**వికారాబాద్, నేటి శుభోదయ :** వికారాబాద్ జిల్లా ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు 100 శాతం ఫీజు రాయితీ కల్పించాలని కోరుతూ వికారాబాద్ జిల్లా జర్నలిస్టులు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ)ను కలిసి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా జర్నలిస్టులు మాట్లాడుతూ సమాజ హితం కోసం అహర్నిశలు శ్రమించే జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. నిత్యం ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే జర్నలిస్టులు తమ కుటుంబాల విద్యాభారం భరించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు భారీగా పెరిగిపోవడంతో పిల్లల చదువులు కొనసాగించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో జర్నలిస్టుల పిల్లలకు పూర్తి ఫీజు రాయితీ అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.వినతిపత్రాన్ని స్వీకరించిన డీఈఓ సానుకూలంగా స్పందిస్తూ, జర్నలిస్టులు కోరిన అంశంపై ఉన్నతాధికారులతో చర్చించి రాయితీ అమలు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.జర్నలిజం సమాజం కోసం చేసే సేవ ఎంతో విలువైనదని, అలాంటి కుటుంబాల విద్యాభారం తగ్గించే దిశగా ప్రభుత్వం ముందుకు రావాలని జర్నలిస్టులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## ఉల్లాస్ – "అమ్మకు అక్షరమాల" కార్యక్రమం ఉల్లాస్ యాప్ పైన ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం విజయవంతం



**నిజామాబాద్, నేటి శుభోదయ :** నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ – అమ్మకు అక్షరమాల కార్యక్రమంలో భాగంగా మెప్మ క్షేత్ర స్థాయి సిబ్బందికి ఉల్లాస్ యాప్‌పై ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమం శుక్రవారం ఐ.డి.ఓ.సి.సమావేశమందిరంలో విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ....చదువు నేర్చుకోలేని చదువు మధ్యలో మానేసిన వయోజనులను గుర్తించి,వారికి చదువు యొక్క ప్రాముఖ్యతను తెలియజేసి వారిని అక్షరాస్యులుగా మార్చాలని,నిజామాబాద్ జిల్లాను 100% అక్షరాస్యత గల జిల్లాగా తీర్చిదిద్దాలని అన్నారు.ఇప్పటికే గుర్తించిన 6776 నిరక్షరాస్యులు మరియు 497 వాలంటీర్ టీచర్లను ఉల్లాస్ యాప్‌లో నమోదు చేసి,లిటరసీ లెర్నింగ్ సెంటర్ల ద్వారా వారికి బోధన అందించి రానున్న FLNAT/NIOS పరీక్షలకు సిద్ధం చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమం విజయవంతం చేయడం కోసం అధికారులు,క్షేత్ర స్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ పురుషోత్తం,మెప్మ డియంసీ మాధురి,అకౌంట్స్ ఆఫీసర్ విజయ,ఏపీఓ టి.అరుంధతి జిల్లా ఇన్‌చార్జ్,రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లు ఎం.సుమన్,ఎ.సత్యనారాయణ మూర్తి పాల్గొని ఉల్లాస్ యాప్ వినియోగం,అభ్యాసకుల నమోదు,వాలంటీర్ మ్యాపింగ్ కార్యక్రమ అమలుపై శిక్షణ అందించారు.ఈ కార్యక్రమంలో మెప్మ క్షేత్ర స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.ఉల్లాస్ యాప్‌లో అభ్యాసకుల నమోదు ప్రక్రియను ప్రత్యక్షంగా ప్రదర్శించి,క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన విధానాలను వివరించారు.కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడగా,జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధనకు అందరూ సమిష్టిగా కృషి చేయాలని అధికారులు పిలుపునిచ్చారు.

## హైటెక్ సిటీలో అనుమానాస్పద నిర్మాణం..
### అధికారుల తనిఖీలు కోరుతున్న స్థానికులు



**హైదరాబాద్, నేటి శుభోదయ :** హైటెక్ సిటీ ప్రధాన రహదారిలోని ఎం.బి. సొసైటీ పరిసరాల్లో కొనసాగుతున్న ఓ నిర్మాణ పనిపై స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఖానమెట్ ప్రాంతంలోని ప్లాట్ నిర్మాణ కార్యకలాపాలు జరుగుతున్నాయని, దీనికి సంబంధించి అవసరమైన అనుమతులు ఉన్నాయా అనే విషయంపై స్పష్టత లేదని వారు పేర్కొంటున్నారు.స్థానికుల సమాచారం ప్రకారం, నిర్మాణం నిబంధనలకు అనుగుణంగా జరుగుతోందా లేదా అన్న అంశంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి వాస్తవ పరిస్థితులను వెలుగులోకి తేవాలని వారు కోరుతున్నారు.ముఖ్యంగా జీహెచ్‌ఎంసీ మరియు టౌన్ ప్లానింగ్ శాఖ అధికారులు నిర్మాణ స్థలాన్ని సందర్శించి, భవన అనుమతులు, ఆమోదిత ప్రణాళికలు, ఇతర సంబంధిత పత్రాలను పరిశీలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. అనుమతులు లేకుండా లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతున్నట్లయితే తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## గ్రామ పార్టీ సభ్యుని పెళ్లిలో సిపిఐఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాన్ వెస్లీ






**ఇబ్రహీంపట్నం, నేటి శుభోదయ :** యాచారం మండలంలోని చింతపట్ల గ్రామా కామ్రేడ్ కందుకూరి కుమార్ పెళ్లికి సిపిఐఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జాన్ వెస్లీ హాజరై ఆశీర్వదించారు, ఆయన మాట్లాడుతూ వధూవరులు తమ జీవితంలో ఎన్నో ఒడిదుడుకులు వస్తున్న వాటిని తట్టుకొని సమాజంలో మేము సైతం అనే విధంగా జీవించాలని అన్నారు. కామ్రేడ్ శ్వేత కామ్రేడ్ కుమార్ ఇద్దరు కూడా శాస్త్రీయమైన పద్ధతిలో తమ జీవితాన్ని గడుపుతారని నేను ఆశిస్తున్నాను అన్నారు. అదేవిధంగా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు మాత్రమే కాబట్టి ఆటుపోటులో ఈ కామ్రేడ్స్ కు పెద్ద సమస్య కాదని ఆయన అభిప్రాయపడ్డారు, సమాజంలో ఎన్నో శక్తులు మన శేష జీవితంలో మన జీవనశైలిలో మనం ఊహించని పరిణామాలు ఎన్నో జరుగుతాయని వాటన్నిటిని తట్టుకొని కామ్రేడ్స్ జీవితం ఎంతో ముందుకు సాగిస్తారని అంటూ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టుతోనే శాస్త్రీయ పద్ధతిలో శాస్త్రీయంగా కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు పద్ధతిలో ఉంటారని ఆశిస్తున్నానుఅన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న కామ్రేడ్స్ అందరికీ మరొకసారి ధన్యవాదాలు. కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు సభ్యులు పార్టీ సానుభూతిపరులు వివిధ ప్రజా సంఘాలు పాల్గొన్నందుకు నాకు ఎంతో సంతోషంగా ఉంది అన్నారు. ఈ పెళ్లి వేడుక కార్యక్రమంలో కామ్రేడ్స్ రాష్ట్ర కమిటీ సభ్యులు డిజి నరసింహారావు పెండ్లి కార్యక్రమం వేడుకల్లో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ. కామ్రేడ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందుకూరి జగన్ యాచారం మండలం సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు ఆలంపల్లి జంగయ్య చింతపట్ల సిపిఎం శాఖ కార్యదర్శి సిహెచ్ సత్యం కె గిరికాంత్. సిపిఐఎం చింతపట్ల గ్రామ పార్టీ సభ్యులు పార్టీ ప్రజా సంఘాల బాధ్యులు పార్టీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# శ్రీ సాయి బాలాజీ అపార్ట్మెంట్‌లో ఆరోగ్య అవగాహన సదస్సు
## - సామాజిక సేవలో డా. జి.వి. సేవలకు ప్రశంసలు

**ఖమ్మం, నేటి శుభోదయ :** బ్యాంక్ కాలనీలోని శ్రీ సాయి బాలాజీ అపార్ట్మెంట్ ఆధ్వర్యంలో అపార్ట్మెంట్ అధ్యక్షులు శ్రీ మురళి గారి అధ్యక్షతన ఆరోగ్య అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి శ్రీరక్ష హాస్పిటల్ అధినేత, ప్రముఖ వైద్యులు డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు (డా. జి.వి.) ముఖ్య అతిథిగా హాజరై అపార్ట్మెంట్ నివాసులకు ఆరోగ్యంపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎం. శ్రీనివాసరావు, డి. నరసింహారావు, డా. ఏలూరు రాజేశ్వరరావు, పోటు రామారావు, కోటేశ్వరరావు, దుద్దుకూరు రమేష్, పోటు శివ, వసంతరావు, లక్ష్మణ్‌రావు తదితర అపార్ట్మెంట్ సభ్యులు పాల్గొన్నారు.సదస్సులో మాట్లాడిన డా. జి.వి. వివిధ కులవృత్తులు నిర్వహించే కార్మికులకు ఎదురయ్యే వృత్తి సంబంధిత ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ మార్గాలు, ముందస్తు జాగ్రత్తలు, క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షల ప్రాముఖ్యతను వివరించారు. అలాగే ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య మరియు పర్యావరణ దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు.ఇటీవల ప్రభుత్వం నిషేధించిన పారాక్వాట్ (Paraquat) కలుపు మందు వల్ల కలిగే ప్రమాదాలు, దాని వినియోగం కారణంగా రైతులు మరియు వ్యవసాయ కార్మికులు ఎదుర్కొనే ఆరోగ్య సమస్యలను వివరించి, ప్రజల ఆరోగ్య రక్షణ దృష్ట్యా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో సముచితమని పేర్కొన్నారు. అనేక వ్యాధులను ముందస్తు జాగ్రత్తలు, జీవనశైలి మార్పులు మరియు సమయానుకూల వైద్య పరీక్షల ద్వారా నివారించవచ్చని ఆయన స్పష్టం చేశారు.ఈ సందర్భంగా అపార్ట్మెంట్‌లోని పెద్దలను, సభ్యులను డా. జి.వి. శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం అపార్ట్మెంట్ వాసులు డా. జి.వి. అందిస్తున్న నిరంతర వైద్య సేవలు, సామాజిక సేవా కార్యక్రమాలను అభినందిస్తూ తమ ప్రశంసలు తెలియజేశారు.ముఖ్యంగా కులవృత్తులు నిర్వహించే కార్మికులను ఆరోగ్యశ్రీ పథకంలో చేర్చాలనే డా. జి.వి. ఆలోచన సమాజానికి ఎంతో ఉపయోగకరమైనదని, ఆ లక్ష్య సాధనకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని వారు ప్రకటించారు.అపార్ట్మెంట్ సభ్యులు మాట్లాడుతూ, "జి.వి. అంటే జీవం పోసే వైద్యుడు... జీవి అంటే సమాజానికి అంకితమైన సామాజిక సేవకుడు" అంటూ ఆయన సేవలను కొనియాడారు. ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా నిరంతరం సేవలందిస్తున్న డా. గోంగూర వెంకటేశ్వర్లు గారి సేవలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు.ఈ ఆరోగ్య అవగాహన కార్యక్రమం అపార్ట్మెంట్ వాసుల్లో ఆరోగ్యంపై బాధ్యతను పెంపొందించడమే కాకుండా, సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రతి ఒక్కరి పాత్ర ఎంత ముఖ్యమో తెలియజేసిన విజయవంతమైన కార్యక్రమంగా నిలిచింది.









Printed Published and Owned by Gongura Srinivas Rao, Printed at M R Publications, # 6-3-1880, Vanasthalipuram, Ranga Reddy (Dist), Telangana 500070. at H.No 8-7-12/671, Sai Colony, Madhuban Colony, Rajendranagar, Ranga Reddy District, Telangana-500077, Editor: Gongura Srinivas Rao, RNI Title Code :- RNI TELTEL/2024/89620